ప్రజాశక్తి
సోమవారం 4 నవంబర్ 2024   8 పేజీలు

గుంటూరు   పల్నాడు

కష్టంగానే ఇసుక!

- మెరుగుపడని సరఫరా
- రెండు నెలలుగా వెంటాడుతున్న వరద
- అల్లాడుతున్న నిర్మాణ దారులు
- ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరులోని కంకరగుంట గేటు వద్ద అడ్డాలో పని కోసం నిరీక్షిస్తున్న కూలీలు (ఫైల్)

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఇసుక సరఫరా అస్తవ్యస్తంగా మారింది. ఈ ఏడాది జులై ఎనిమిదిన ఉచిత ఇసుక విధానం ప్రకటించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉచిత ఇసుక విధానం పగడ్బందీగా అమలు జరిగిన పరిస్థితి లేదు. ప్రస్తుతం కృష్ణా పరివాహక ప్రాంతంలో ఎక్కడా ఇసుక సరఫరా జరగడం లేదు. రెండు జిల్లాల పరిధిలో కొన్ని రీచ్‌లకు ఇసుక తవ్వకాలకు అనుమతిచ్చారు. నదీగర్భం నుంచి ఇసుకను బయటకు తెచ్చి స్టాక్ యార్డుల వద్ద పోయాలని కాంట్రాక్టర్లకు టెండర్లు ఖరారు చేశారు. కానీ నదీ గర్భంలో వరద ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల ఇసుక తీయడం సాధ్యం కాలేదని చెబుతున్నారు. దీనివల్ల గుంటూరు, పల్నాడు జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో ఇసుక లభ్యం కావడం లేదు. దీంతో గతనెల రోజులుగా గుంటూరు జిల్లాలో పూర్తిగా నిలిపివేశారు.

పల్నాడు జిల్లాలో గత నాలుగు రోజుల క్రితం వరకు మాదిపాడు రీచ్ వద్ద కొంత సరఫరా జరిగినా పూర్తిస్థాయిలో సరఫరా మెరుగుపడలేదు. స్థానికులు ఎవరైనా ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా ఇసుకను తీసుకువెళ్లవచ్చునని ప్రభుత్వం ప్రకటించినా జిల్లాలోని కృష్ణా పరివాహక ప్రాంతంలో సొంతంగా ఎటువంటి వాహనాలతో వచ్చినా అనుమతించడం లేదు. గ్రామ సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకుని రావాలని పోలీసు, రెవెన్యూ అధికారులు హుకుం జారీ చేస్తున్నారు. సొంత వాహనం తీసుకుని నది వద్దకు వెళ్లిన తరువాత ఇలా అభ్యంతరం చెప్పడంపై ప్రజల్లో అసంతృప్తి ఏర్పడింది. తగిన సమాచారం లేకుండా ప్రభుత్వం ప్రకటనలు ఇవ్వడం, క్షేత్రస్థాయిలో అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరించడంపై వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగడం వల్ల ప్రస్తుతం నదీగర్భం నుంచి ఇసుక తీయలేకపోతున్నామని అధికారులు తెలిపారు. గత రెండు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. సెప్టెంబరు 2వ తేదీన ప్రారంభమైన

▸ 2లో

ఐక్యతా అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, వివిధ సంఘాల నాయకులు

ప్రజల గొంతుక పిడిఎఫ్‌ను గెలిపించండి

కెఎస్ లక్ష్మణరావుకు వివిధ సంఘాలు మద్దతు

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి 2025 మార్చిలో జరిగే ఎన్నికల్లో పిడిఎఫ్ తరపున ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, ప్రజా సంఘాల మద్దతుతో పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని పలు సంఘాల నాయకులు కోరారు. ఆదివారం అరండల్‌పేటలోని గీతా రీజెన్సీలో లక్ష్మణరావు అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ వివిధ సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ 2007లో శాసన మండలి పునరుద్ధరించిన తర్వాత ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల నుండి గెలుపొందిన ఏడుగురు

▸ 2లో

చదువుకోవటం ఇష్టంలేకే చనిపోతున్నా

▸ 6లో

సహకార సంఘాల్లో కంప్యూటర్ సేవలు

- రికార్డులన్నీ కంప్యూటరీకరణ
- రైతుసేవా కేంద్రాలతో అనుసంధానం
- కొత్త సభ్యుల చేరికపై మార్గదర్శకాలు రాలేదు
- ప్రజాశక్తితో జిల్లా సహకార శాఖ అధికారి కె.వీరాచారి

8లో

డిసెంబర్ 13,14 తేదీల్లో పల్నాడు బాలోత్సవం

- 8 లో

రౌడీయిజాన్ని సహించం : ఎస్‌పి

దీపావళి వేడుకల్లో దాడి కేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి -గుంటూరు జిల్లాప్రతినిధి

దౌర్జన్యాలు, రౌడీయిజాన్ని సహించేది లేదని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. గతనెల 31న దీపావళి రోజున ఇన్నర్ రింగ్ రోడ్డులో ఒక అపార్టుమెంట్‌లో క్రాకర్స్ తమ ఇంటిపై పడ్డాయని కొంతమంది వ్యక్తులతో కలిసి కాకర నరేంద్రరెడ్డి ఎదురు ఇంటి వారిపై దాడికి పాల్పడిన ఘటనలో నిందితులను మీడియా ముందు హాజరు పరిచారు. ఈ కేసులో నలుగురిని అరెస్టు చేశామని, ఇంకా కొంత మంది పరారీలో ఉన్నారని తెలిపారు. కాకర

▸ 2లో

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ... వెనక వరుసలో ముసుగులో నిందితులు

శ్రద్ధాంజలి

జననం :
17-1-1953

మరణం :
25-10-2024

కీ॥శే॥ శ్రీ బొల్లు శంకరరావు గారు
సిపిఐ(ఎం) నాయకులు

ప్రేమ, ఆప్యాయత, అనురాగాలను మాకుపంచి, మా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన
మీరు భౌతికంగా మానుండి దూరమైనప్పటికి సదా మీ జ్ఞాపకాలను స్మరించుకుంటూ...
మీరు చూపిన ఆదర్శబాటలో పయనిస్తామని తెలుపుతూ... అశ్రునయనాలతో...

భార్య: బొల్లు కోటేశ్వరమ్మ

కుమార్తె - అల్లుడు
విజయ గౌతమి - సురేష్
మనుమడు, మనవరాలు
వివన్ గౌతమ్, భవ్య

కుమార్తె - అల్లుడు
నవీన భారతి -శ్రీకాంత్
మనవరాళ్లు
ధృతి, దేవాన్షిణి

పెద్దకర్మ : ది4-11-2024 సోమవారం పల్నాడుజిల్లా, చిలకలూరిపేట మండలం,
బొప్పూడి గ్రామంలోని మా స్వగృహమునందు జరుగును.

నకిలీ వరి విత్తనాలతో నట్టేట మునిగిన రైతులు

ప్రజాశక్తి-ఈపూరు

నందీశ్వర వరి విత్తనాలలో అధిక మోతాదులో కేళీలు రావడంతో ఊడిజెర్ల గ్రామ రైతులు నట్టేట మునిగారని ఏపీ రైతు సంఘం నాయకులు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము అన్నారు. ఊడిజెర్లలో కేళీలు వచ్చిన వరి పైరును రైతులతో కలిసి ఆయన ఆదివారం సందర్శించారు. ఈపూరులోని ఓ ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ షాపులో గ్రామానికి చెందిన రైతులు నందీశ్వర రకం వరి విత్తనాలను కొనుగోలు చేసి వందలాది ఎకరాలు సాగు చేశారన్నారు. వరి పొట్ట దశలో ఉండగా కేళీలు బయటపడటంతో షాపు వారికి రైతులు తెలిపినా స్పందించలేదన్నారు. బాధిత రైతులకు కంపెనీ తరుపున ఎకరాకు రూ.35 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నకిలీ వరి విత్తనాలపై జిల్లా వ్యవసాయ అధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

రామప్పగుడిని సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- వెల్దుర్తి

కార్తీక మాసం సందర్భంగా మాచర్ల పట్టణ శివారులోని రామప్ప ఆలయాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం సందర్శించారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటి సభ్యులు స్వాగతం పలికి సన్మానించారు. కమిటీ సభ్యులు కె.యల్లమంద, పి.చంద్రశేఖరరావు, ఎస్.వెంకటరత్నం, పి.లక్ష్మీనారాయణ, టి.పెదఅంకారావు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని చిరుమామిళ్ల ఏపీ మోడల్ పాఠశాల అగ్రికల్చర్ వొకేషనల్ ట్రైనర్ అయిన పి.ప్రవీణ్ నాయక్‌కు ఉత్తమ అగ్రికల్చర్ వొకేషనల్ ట్రైనర్‌గా ఇండస్ ఎడ్యుట్రైన్ ప్రైవేట్ లిమిటెడ్ (విటిపి) తరపున ఇండస్ కంపెనీ కో-ఆర్డినేటర్లు ఆదివారం ఘనంగా సత్కరించారు. ప్రవీణ్ నాయక్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీవాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

కష్టంగానే ఇసుక!

(మొదటి పేజీ తరువాయి)

వరద కొంత హెచ్చుతగ్గుదలతో ఎగువ నుంచి దిగువకు నీటి విడుదల చేస్తుండటంతో ఇసుక సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని అధికారులు చెబుతున్నారు. అడపాదడపా కొంత సరఫరా జరిగినా పూర్తిస్థాయిలో నిర్మాణాలకు సరిపోవడం లేదు. గత రెండు

నెలలుగా ఉచిత ఇసుక సరఫరా ఫార్సుగా మారింది. ఇసుక సరఫరా లేక నిర్మాణ దారులు అల్లాడుతున్నారు. అలాగే నిర్మాణాలు జరగక ఉపాధి లేక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజి నుంచి సగటున 30 వేల నుంచి 40 వేల క్యూసెక్కుల వరకు వరద ప్రవాహం కొనసాగుతోంది. అయితే ఎన్‌టిఆర్ జిల్లాలోని పలు మండలాల్లో వరద ప్రభావం లేకపోవడం వల్ల ఆ జిల్లా నుంచి గుంటూరు, పల్నాడు జిల్లాలకు ఇసుక రవాణా జరుగుతోంది. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న వారికి రవాణా ఛార్జీలు ఎక్కువైనా ఎన్‌టిఆర్ జిల్లా నుంచి సరఫరా పాక్షికంగా జరుగుతున్నట్టు పలువురు నిర్మాణదారులు తెలిపారు. గుంటూరు, పల్నాడు జిల్లాలో త్వరలో ఇసుక సరఫరా మెరుగుపడుతుందని మైనింగ్ అధికారి ఒకరు చెప్పారు.

ప్రజల గొంతుక పిడిఎఫ్‌ను గెలిపించండి

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్సీలు పిడిఎఫ్‌గా ఏర్పడి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, ఇతర ప్రజా సమస్యలపై పనిచేసినట్లు తెలిపారు. అప్పటి నుండి 2024 వరకూ 13 మంది పిడిఎఫ్ తరపున గెలుపొంది నిజాయితి, నిబద్ధతతో పనిచేస్తున్నట్లు చెప్పారు. ఏ ప్రభుత్వం ఉన్నా ప్రజల సమస్యలను మండలిలో ప్రస్తావిస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు, కౌలురైతులు, మహిళలు, ఉపాధ్యాయ, పెన్షనర్లు మొదలైన వారి సమస్యల పరిష్కారానికి మండలిలో, వెలుపలా నిరంతంర పోరాడుతున్నామన్నారు. రాజ్యాంగ నిర్మాతలు ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ స్థానాలను ప్రత్యేక లక్ష్యంతో ఏర్పాటు చేశారని, ఆ లక్ష్యం దెబ్బతినే విధంగా కొన్ని రాజకీయ పార్టీలు ప్రవర్తిస్తున్నాయని చెప్పారు. ఈ ఎన్నికల్లో తనకు అనేక తరగతుల ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారన్నారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా కార్యదర్శి కళాధర్, సిఐటియు నాయకులు డి.లక్ష్మీనారాయణ, ఇన్సూరెన్స్ ఉద్యోగుల నాయకులు వివికె.సురేష్, ఐలు నాయకులు నర్రా శ్రీనివాసరావు,

మాట్లాడుతున్న ఎం.హనుమంతరావు, కళాధర్

బ్యాంకు ఉద్యోగులు నాయకుల సాంబశివరావు, ఎల్ఐసి ఏజెంట్స్ యూనియన్ నాయకులు గాంధీ రామ్మోహనరావు, కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం నాయకులు ఆర్.స్వాతి, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కె.అనురాధ, మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల సంఘం నాయకులు ముత్యాలరావు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ జెఎసి నాయకులు బి.లక్ష్మణరావు, అంగన్‌వాడీ నాయకులు చిన్నవెంకాయమ్మ, విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు నాగబ్రహ్మాచారి, 108 ఉద్యోగుల సంఘాల నాయకులు బాబు, నర్సింగ్ అసోసియేషన్ నాయకులు స్వచ్ఛంద ప్రసాద్ తదితరులు

మాట్లాడుతున్న వివికె సురేష్, ఆర్.స్వాతి

మాట్లాడుతున్న కె.అనురాధ, డి.లక్ష్మీనారాయణ

పాల్గొని మద్దతు తెలిపారు. ప్రజల గళాన్ని మండలిలో వినిపించటానికి పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

ఆర్ఆర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం సంతగుడిపాడులో నరసరావుపేట ఆర్ఆర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్ కోసూరు సుబ్బారావు సూచన మేరకు ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ సభ్యులు మామిళ్లపల్లి ఆదిబాబు ప్రారంభించారు. గుండె, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ చింతగుంట శిరీష 372 మందికి ఈసిజి, 2డి ఎకో పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సడన్ కార్డియాక్ అరెస్ట్, సిపిఆర్ ప్రాముఖ్యత వివరించారు. హాస్పిటల్ అధినేత డాక్టర్ చింతకుంట అజయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్వగ్రామంలో ప్రజలకు సేవ చేయడం, ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. చింతకుంట అంజిరెడ్డి, చెంచిరెడ్డి, అచ్చుల శ్రీను, బండారుపల్లి నాగేశ్వరరావు, గార్లపాటి వెంకటేశ్వర్లు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శిరీష

బాప్టిస్ట్ చర్చి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : సత్తెనపల్లి బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గం ఆదివారం ఎంపికైంది. ఈ కార్యవర్గం రెండేళ్లపాటు కొనసాగుతుందని సంఘ పెద్దలు తెలిపారు. ప్రసిడెంట్‌గా గుజ్జర్లపూడి స్కైలాబ్, వైస్ ప్రసిడెంట్‌గా గుజ్జర్లపూడి చంద్రకాంత్, సెక్రెటరీగా కూచిపూడి మోజెస్ ఆనిరాజ్, జాయింగ్ సెక్రెటరీగా బంకా కిషోర్ బాబు, ట్రెజరర్‌గా గుజ్జర్లపూడి రవిరాజు, వైస్ ట్రెజరర్‌గా గుజ్జర్లపూడి వందన కుమార్, సభ్యులుగా గర్నెపూడి ఫ్రాన్సిస్, సంగెపు నరేష్, రాచపూడి జైపాల్, గుజ్జర్లపూడి నిరంజన్ ప్రకాష్, దంతం కుమార్, గంగవరపు పెద్ద ప్రసాద్, జమళ్ళమూడి మార్కు, మక్కెన రాజారావు, పరిచారకులుగా సంగెపు ప్రభాకరరావు, గుజ్జర్లపూడి ఆనందరావు ఎంపికయ్యారు.

రౌడీయిజాన్ని సహించం : ఎస్‌పి

(మొదటి పేజీ తరువాయి)

నరేంద్రరెడ్డి, వరగాని వెంకటేష్, యల్లా సాయిప్రకాష్, అరుదల శివయ్యను అరెస్టు చేశారు. ఇన్నర్ రింగ్ రోడ్డులోని శకుంతల నగర్ రెండో లైనులో జెసిహెచ్ ప్యారడైజ్ అపార్టుమెంట్స్‌లో సోనియా కుటుంబ సభ్యులపై నరేంద్రరెడ్డి దాడికి పాల్పడ్డారు. అతనితోపాటు డేవిడ్, రవితేజ, వెంకట్, రాము, సాయి, శివ, షేక్ అనాస్, ఋషికేశ్‌రెడ్డి తదితరులు దాడిలో పాల్గొన్నారని సోనియా ఫిర్యాదు చేశారు. తన కుమారుడు అవినాష్‌ను చంపడానికి ప్రయత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అతనికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. సిసి కెమెరాల ఆధారంగా నిందితుల్లో ఇప్పటి వరకు నలుగురిని అరెస్టు చేశామని, మిగతా వారిని త్వరలో అరెస్టు చేస్తామని ఎస్‌పి చెప్పారు. డిఎస్‌పి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నల్లపాడు సిఐ వంశీధర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'కూటమి ప్రభుత్వ పాలనలో పెరిగిన లైంగిక దాడులు'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే చిన్నపిల్లలపై, మహిళలపై లైంగిక దాడులు, హత్యలు ఎక్కువయ్యాయని, విద్యార్థులు తీవ్ర ఒత్తిడితో ఆత్మహత్యలు చేసుకునేలా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యవహరిస్తున్నాయని ఐద్వా పట్టణ కార్యదర్శి పి.భారతి, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పి.శివగణేష్, సిఐటియు మండల కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేస్తామని ఎన్నికలప్పుడు చెప్పినా ఎక్కడా నిరోధించిన దాఖలాలు లేవన్నారు. తిరుపతిలో మూడేళ్ల పసిపాప హత్యాచారం క్రూరమైన చర్యగా పేర్కొన్నారు. మత్తులో ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని అభిప్రాయపడ్డారు. గుంటూరులో విద్యార్థినులు మానసిక ఒత్తిడి గురై ఆత్మహత్య చేసుకోవటం, రేపల్లె ప్రాంతాల్లో జరిగిన ఘటన, రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఘటనలకు ప్రభుత్వానిదే బాధ్యతని పేర్కొన్నారు. మద్యపానాన్ని నిషేధిస్తామని చెప్పి మరోవైపు గతంకంటే షాపులు పెంచారని విమర్శించారు. ఈ అంశాల్లో ప్రభుత్వ తీరు మారకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. దాడులకు గురైన కుటుంబాలకు న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

డ్రైయినేజీకి అడ్డుగా ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రజాశక్తి- మాచర్ల : పట్టణంలోని మురుగు కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. వీధుల్లో చిన్న చిన్న కాల్వలు, పెద్ద కాల్వల్లో సైతం ప్లాస్టిక్ వ్యర్థాలుతో నిండి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో కల్వర్టుల వద్ద, మరికొన్ని చోట్ల మురుగునీరు రోడ్లపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. ప్లాస్టిక్ కాలుష్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అంటే కేవలం ఒకేసారి వాడి పారేసే ప్లాస్టిక్‌దే అగ్రస్థానం. ఇప్పటికే దీన్ని 60కి పైగా దేశాలు నిషేధించాయి. భారత్‌లోనూ కొన్ని రాష్ట్రాల్లో, మాచర్లలోను దీనిపై ఆంక్షలున్నాయి. అయినా యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. వాడిన ప్లాస్టిక్ సంచులు, నీళ్ల సీసాలు, సోడా సీసాలు, స్ట్రాలు, ప్లేట్లు, కప్పులు, ఫుడ్ ప్యాకేజీ బాక్సులు తదితర ప్లాస్టిక్ వస్తువులు కాల్వల్లో వేయటం వల్ల మురుగు పారటం లేదు. ప్రస్తుతం మున్సిపల్ అధికారులు పట్టణంలోని ప్రధాన మురుగు కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టారు. కాల్వలో ప్రధానంగా ప్లాస్టిక్ వ్యర్థాలే కనపడుతున్నాయి. ప్రధాన డ్రైనేజీలు రహదారి వెంట వ్యాపార సముదాయాల ముందునుంచే వెళుతున్నాయి. ఆయా కొట్ల వారు తమ ముందు వున్న మురుగు కాల్వలపై పెద్ద పెద్ద రాళ్లతో మూతలు వేసి ఎప్పుడు పడితే అప్పుడు మురుగు తీయటానికి వీలులేకుండా ఆటంకాలు కల్పిస్తున్నారు. దాంతో వ్యాపార సముదాయాల నుంచి వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలు ఆ కాల్వల్లో పేరుకుపోతున్నాయి. పురపాలక శాఖ అధికారులు గత ఐదేళ్లలో కాల్వల జోలికి వెళ్లలేదు. ప్రస్తుతం విపరీతంగా విషజ్వరాలు ఉన్న నేపథ్యంలో కాల్వల పూడికతీతపై దృష్టి సారించి మురుగు తొలగిస్తున్నారు. అలా కాకుండా ప్రతి మూడు నెలలకు ఒక

సారైనా మురుగు తొలగించే ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు ప్లాస్టిక్ వ్యర్థాలపై దాడులు చేసినా పూర్తి స్థాయిలో వాటిని కట్టడి చేయలేకపోతున్నారు. ప్రతిఒక్కరూ ఈ ప్లాస్టిక్ వాడకాలతో పాటు ఇళ్లల్లో ఉన్న వ్యర్థాలు సైతం మురుగుకాల్వల్లో పడేయడంతో మురుగునీరు పారకుండా అడ్డుగా ఏర్పడుతున్నాయి. దీనిపై స్థానికులకు అవగాహన కల్పిస్తూ, నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేసేవారిపై కఠిన చర్యలు కూడా చేపట్టాలనే సూచనలు వస్తున్నాయి.

మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

హాజరైన కార్మికులు

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం రాత్రి సుందరయ్య నగర్ లీల సుందరయ్య కళావేదికపై తాడేపల్లి పట్టణ భవన నిర్మాణ కార్మికులు విస్తృత సమావేశం భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నారిన నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కార్మికులు కడుతున్న సోమ్మును వారి అభివృద్ధికి వినియోగించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు ఈ నిధులను పక్కదారి పట్టించారని విమర్శించారు. ఉచిత ఇసుక విధానం అమలు చేయడంలో గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడా లేదని చెప్పారు. గతంలో లాగానే ట్రాక్టర్ ఇసుక రూ.7,000 నుండి 10000 రూపాయలకు కొనుగోలు చేయాల్సి వస్తుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఇసుక వాగ్దానం నేటికీ నెరవేరలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చి నిర్మాణ కార్మికులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ రాజధాని నిర్మాణంలో స్థానిక నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొట్టే కరుణాకర్ రావు, కోట బాబురావు, సిహెచ్ భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

నాగరాజును సత్కరిస్తున్న వెంకటేష్

మా ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకునికి సత్కారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మా ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ స్వర్ణ నాగరాజుని ఆదివారం నరసరావుపేట మాజీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మాజేటి వెంకటేష్ సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతు సేవా కర్యక్రమంలో భాగంగా అనాధలకు, నిరాశ్రయు లకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ వైద్య సహాయం కోసం తన దృష్టికి వచ్చిన వారికి దాతల ద్వారా విరాళాలు సేకరించి అండగా నిలుస్తున్న నాగరాజు అభినందనీయుడని తెలిపారు. నిరాశ్రయులకు, వృద్ధులకు, యాచకులకు దాతల సహాయంతో ఆహారం అందించి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారన్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తనకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

పక్షవాతం గురించి అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న డాక్టర్ పవన్‌కుమార్

ప్రస్తుత రోజుల్లో పక్షవాతం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యూరా లజిస్ట్ డాక్టర్ సిహెచ్. పవన్‌కుమార్ అన్నారు. అవగాహన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ మెదడుకు రక్త సరఫరా చేసే నాళాలలో బ్లాక్‌లు ఏర్పడినా, రక్తనాళాలు చిట్లినా బ్రెయిన్ స్ట్రోక్‌కు దారితీస్తుందన్నారు. ఈబ్రెయిన్ స్ట్రోక్‌కు సంబంధించిన లక్షణాలు తెలియజేస్తూ అకస్మాత్తుగా కంటి చూపు పోయినా, వినికిడిపోయినా, స్పర్శ పోయి మొద్దుబారిపోయినా, ఉన్నట్టుండి తూలుడు, తల తిరగడం, అకస్మాత్తుగా భరించలేని తలనొప్పి వంటివన్నీ బ్రెయిన్‌స్ట్రోక్ లక్షణాలుగా గుర్తించి వెంటనే న్యూరాలజిస్ట్‌ను కలిసి తగిన వైద్యం పొందాలన్నారు. లక్షణాలు కనబడిన వెంటనే ఒక గంట నుంచి నాలుగున్నర గంటల లోపు డాక్టర్‌ను సంప్రదించి, మంచి వైద్యం పొందితే బ్రెయిన్‌స్ట్రోక్ నుండి బయటపడవచ్చన్నారు. ఒక్కొక్కసారి షుగర్‌స్థాయి పడిపోయినప్పుడు కూడా ఇలాంటి బ్రెయిన్‌స్ట్రోక్ లక్షణాలు కనపడతాయన్నారు. పక్షవాతం లక్షణాలు కనబడినప్పుడు ఆందోళన చెందకుండా ముందు షుగర్ లెవల్స్‌ను పరీక్ష చేసుకుని ఒకవేళ రక్తంలో చక్కెర శాతం తగ్గితే వెంటనే దానికి సంబంధించిన చర్యలు తీసుకుంటే సరిపోతుందన్నారు. పనికి తగ్గ ఆహారం తీసుకోవాలని, అలా కాకుండా అధికంగా ఆహారం తీసుకుంటే ఆ క్యాలరీలు ఖర్చు అవ్వక శరీరంలో కొలెస్ట్రాల్‌గా ఏర్పడి అనేక అనారోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే గుండెకు సంబంధించి ఈసీజీ, ఎకో పరీక్ష చేయించి వారికి సాధారణంగా ఉంటే గుండె జబ్బులు లేనట్లుగా భావిస్తామని, కానీ ఒక్కొక్కసారి ఆ పరీక్షల్లో సాధారణస్థాయి చూపించినప్పటికీ గుండెకు సంబంధించిన సమస్య ఉండవచ్చన్నారు. కావున ఈసీజీ, ఎకో పరీక్షల్లో ఫలితాలు నార్మల్‌గా కనిపించినప్పటికీ గుండె సమస్యలకు సంబంధించిన లక్షణాలు కనబడుతుంటే ట్రెడ్‌మిల్, యాంజియోగ్రామ్ లాంటి పరీక్షలు చేయించుకుంటే మన గుండె స్థితిని మెరుగ్గా తెలుసుకోవచ్చన్నారు. రోజుకి అరగంట చొప్పున వారానికి ఐదు రోజులు వాకింగ్ చేస్తుంటే పక్షవాం, గుండె సమస్యలకు దూరంగా ఉండవచ్చన్నారు. మంచి ఆహారం తీసుకోవడం, ధూమపానం మద్యపానంకు దూరంగా ఉండటం ద్వారా చాలావరకూ అనారోగ్య సమస్యలకు గురి కాకుండా ఉండవచ్చన్నారు. అనంతరం డాక్టర్ పవన్‌కుమార్‌ను అవగాహన సభ్యులు సత్కరించారు. ఈ సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, ఉపాధ్యాయ నాయకులు ఏ.వి రామారావు, విశ్రాంత అధ్యాపకుడు ఆర్.రామచంద్రరావు, అనవేమ ట్రస్ట్ అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి లు ప్రసంగించారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

యువకుల మృతదేహాలు

ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ సంఘటన సత్తెనపల్లి మండలం వెన్నాదేవి సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో యడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామానికి చెందిన రాయపాటి రోశయ్య (32) కట్టా వీరేంద్ర (18) అక్కడికక్కడే మరణించారు. రోశయ్య ధూళిపాళ్ల సమీపంలో ఉన్న రైతు నేస్తం శీతల గిడ్డంగిలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. రోశయ భార్య ప్రేమలత 15రోజుల క్రితం రెండో బిడ్డకు జన్మనిచ్చింది. కాకుమానులో ఉంటున్న భార్య వద్దకు వచ్చిన అతను తిరిగి లింగారావు పాలెం లోఉన్న టేబుల్ ఫ్యాన్ తీసుకెళ్లేందుకు గ్రామానికి వచ్చాడు. ఫ్యాన్ పట్టు కునేందుకు కట్టా వీరేంద్రను బైక్ పై ఎక్కించుకుని ధూళిపాళ్ల కోల్డ్ స్టోరేజ్ వద్దకు వెళ్ళే క్రమంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. విషయం తెలుసుకున్న సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రూరల్ సీఐ పి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసిపి నాయకులపై కేసు : డిఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగర వైసిపి అధ్యక్షులుగా డైమండ్ బాబు ప్రమాణస్వీకారం సందర్భంగా శనివారం నగరంలో అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అసౌకర్యం కల్గించినందుకు పలువురు నేతలపై కేసు నమోదు చేసినట్టు తూర్పు డిఎస్‌పి అబ్దుల్ అజీజ్ తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా కాకాని రోడ్డు నుంచి శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరం వరకు ర్యాలీ చేశారని బస్టాండ్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అయిందని ఆయన తెలిపారు. సామాన్య జన జీవనానికి ఇబ్బంది కల్గించి, వాహనా లను రోడ్డుకు అడ్డంగా నిలిపి ర్యాలీ నిర్వహించినందుకు కేసు నమోదు చేశామన్నారు. ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా, ర్యాలీలు, సభలు, సమావేశాలు జరిపినట్లుయితే కేసులు నమోదు చేస్తామని డిఎస్‌పి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత గుంటూరు సిఐ సోమయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం టీడీపీ నాయకులు స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. మంగళగిరి పట్టణంలోని 29వ వార్డుకు చెందిన కమ్మెల పాములుకు రూ. లక్షా 80 వేలు, బ్యాంకు కాలనీకి చెందిన తోలేటి విజయభాస్కర్‌కు రూ 84, 928 వేలు, 12వ వార్డుకు చెందిన బత్తుల రాణికి రూ 67, 646 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, 30వ వార్డు అధ్యక్షులు బైరుబోయిన శివశంకర్, గుంటూరు పార్లమెంట్ మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ ఖాదర్ వలి, నియోజకవర్గ జనసేన మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ సుభాని, పట్టణ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ సమీరా, పట్టణ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నాగయ్య, పట్టణ తెలుగు యువత ఉపాధ్యక్షులు టి అనురాగ్, వల్లభనేని భార్గవ్, ఒక్కలగడ్డ కిషోర్ కుమార్, గొల్లపూడి సాయి, కాకర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జయరాంబాబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీరాంజనేయులు తదితరులు

అలరించిన సంగీత విభావరి

ప్రజాశక్తి-గుంటూరు

దివంగత మాజీ ఎమ్మెల్యే చదలవాడ జయరాంబాబు వర్ధంతి సందర్భంగా స్థానిక అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో నవకళోదయ ఆర్ట్స్ గుంటూరు వారి ఆధ్వర్యంలో ఘంటసాల సినీసంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ విద్యావేత్త కన్న మాస్టర్, అఖిలభారత పంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తీ వీరాంజనేయులు, మేకల రవీంద్రబాబు, బిళ్ళా వేదయ్య తనయుడు అశోక్, వెంకాయమ్మలు, చదలవాడ రఘురాం హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాయనీ గాయకులు టి.సుధీర్, వీరయ్య, మధుబాబు, నారాయణ, సుబ్బారావు, వలి, మోహన్, గాయత్రి అన్నపూర్ణలు పాత పాటలను మధురంగా ఆలపించి శ్రోతలను అలరించారు. కార్యక్రమానికి వ్యాఖ్యతగా ప్రముఖ హిందీ పండిట్ నజీర్ వ్యవహరించగా, ఆర్గనైజర్ పిఎల్ఎన్ మూర్తి నిర్వహించారు.

ఈనెల 30 నుండి పల్నాటి వీరారాధన ఉత్సవాలు

ప్రజాశక్తి - కారంపూడి

పలనాటి వీరుల కొణతల మహోత్సవాలు ఈ నెలలో ప్రారంభం అవుతాయని కారంపూడి పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఆదివారం తెలిపారు. కార్తీక అమావాస్య రోజున కారంపూడి వీర్లగుడి ప్రాంగణంలో వీరుల మహోత్సవాలు ప్రారంభం అవుతాయని, ఈ ఉత్సవాలు 5 రోజుల పాటు జరుగుతయని తెలిపారు. 5 రోజులు జరిగే ఉత్సవాల తేదీలను ప్రకటించారు. నవంబర్ 30 శనివారం : రాచగావు, డిసెంబర్ 1 ఆదివారం : రాయబారం, డిసెంబర్ 2 సోమవారం : మందపోరు, డిసెంబర్ 3 మంగళవారం : కోడిపోరు, డిసెంబర్ 4 బుధవారం : కల్లిపాడు.. ఉత్సవాలలో 3వ రోజు అయినా మందపోరు కార్యక్రమన్ని పురస్కరించుకొని అలనాడు బ్రహ్మనాయుడు ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనాలు (చాపకుడు) నిర్వహిస్తామని పలనాటి వీరాచారపీఠం నిర్వాహకులు బొగ్గరం విజయ్ కుమార్ తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులు బీమా పథకానికి నమోదు చేయించుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - అమరావతి

భవన నిర్మాణ కార్మికులు బీమా పథకానికి పేర్లు నమోదు చేయించుకోవాలని సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు బి.సూరిబాబు, ఎస్‌కె.రఫీ కోరారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు ప్రమాదాలు జరిగి వైకల్యం ఏర్పడినా, మరణించినా, లేదా సహజ మరణానికి గురైనా ఈ బీమా వారి కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్మికుల పిల్లల చదువులు, పెళ్లిళ్లకు ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఇప్పటికే బీమా ఉన్నవారు దానిని రెన్యువల్ చేయించుకోవాలని, లేనివారు కొత్తగా నమోదు చేసుకోవాలని సూచించారు. కొత్తగా నమోదయ్యేవారు తమ రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, రెండు పాస్ ఫొటోలు, బీమా రుసుమును తీసుకుని అమరావతిలోని కార్మిక శాఖాధికారిని సంప్రదించాలని సూచించారు.

సిపిఎం సభ్యునిపై దాడికి ఖండన

ప్రజాశక్తి - అమరావతి

సిపిఎం కార్యకర్తపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ పార్టీ అమరావతి రూరల్ కార్యదర్శి బి.సూరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఎండ్రాయి గ్రామానికి చెందిన నండూరి వెంకటేశ్వరరాజు ఇంటి వద్ద నుండి రోడ్డు మీదకు వచ్చారని, అతని బైక్ స్టార్ట్ కాకపోవడంతో స్థానికుడే అయిన ఒకర్ని పిలవగా గోరంట్ల నాని, గోరంట్ల నాగమల్లేశ్వరరావు, రత్నాకర్ ప్రసాదు వచ్చి దాడి చేశారని పేర్కొన్నారు. నండూరి వెంకటేశ్వరరాజు అమరావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, దీనిపై పోలీసులు కేసు నమోదు చేయడంతోపాటు దాడికి పాల్పడ్డ వారిని అరెస్టు చేయాలని కోరారు. ఇదిలా ఉండగా దాడికి గురైన వెంకటేశ్వరరాజును ఆస్పత్రిలో సూరిబాబు పరామర్శించారు.

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు లాంచీల్లో వెళ్లిన పర్యాటకులు కొండలోని మ్యూజియంలో ఉన్న బుద్ధిని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం,అశ్వమేథ శాల, స్నానాల గట్టు, బోధి వృక్షాన్ని సందర్శించారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపి స్టేడియం, అశ్వమేథ యజ్ఞశాల, శ్రీ రంగనాథస్వామి దేవాలయం, తదనంతరం 60 అడుగుల ఎత్తునుండి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. లాంచీల ద్వారా రూ.41 వేల ఆదాయం పర్యాటక శాఖకు సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

ప్రజల పక్షాన పోరాడే నిజమైన ప్రత్యామ్నాయం సిపిఎం

- సత్తెనపల్లి పట్టణ మహాసభలో రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య
- పలు సమస్యల పరిష్కారం కోసం తీర్మానాలు ఆమోదం
- పట్టణ కార్యదర్శిగా ధరణికోట విమల తిరిగి ఎన్నిక

జెండా ఆవిష్కరణలో సిపిఎం శ్రేణులు.. మహాసభలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య (ఇన్‌సెట్)

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలు రానున్న కాలంలో ప్రజలకు మరింత భారంగా పరిణమిస్తాయని, ప్రజల జీవన పరిస్థితులు చింద్రమౌతాయని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో (కామ్రేడ్ పులిపాటి చిన్న వెంకటేశ్వర్లు ప్రాంగణంలో) ఆదివారం జరిగిన సిపిఎం సత్తెనపల్లి పట్టణ మహాసభకు కట్టా శివదుర్గారావు, గద్దె ఉమశ్రీ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ముందుగా మహాసభ ప్రాంగణం ఎదుట జెండాను సీనియర్ నాయకులు గుంటూరు వేమయ్య, కూరపాటి శంకరరావు ఆవిష్కరించారు. అనంతరం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపికి వైసిపి, వైసిపికి టిడిపి పార్టీలు ప్రత్యామ్నాయం కాదని, పేదల పక్షాన నిరంతరం పనిచేస్తున్న సిపిఎం ప్రత్యామ్నాయమని చెప్పారు. బిజెపి మతోన్మాదం తీవ్ర స్థాయికి వెళ్లిందని, దాని విధానాలకు రాష్ట్రంలోని టిడిపి, జనసేన, వైసిపి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ అధిక ధరలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, జమిలి ఎన్నికలు రద్దు చేయాలని, మహిళలపై దాడులు అరికట్టాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలను పరిరక్షించాలని ప్రభుత్వా లను డిమాండ్ చేశారు. ఈ అంశాలపై ఈనెల 8వ తేదీ నుంచి 15 వరకు నిర్వహించే ప్రజాపోరు ప్రచార యాత్ర జయప్రదానికి పిలుపునిచ్చారు.

అనంతరం పలు సమస్యలపై మహాసభ చర్చించి తీర్మానాలను ఆమోదించింది. ఆస్తి పన్ను పెంపుపై తెచ్చిన 197, 198 జీవోలను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణల చట్టాన్ని రద్దు చేయాలని, ఉపాధి హామీ చట్టాన్ని పట్టణ ప్రాంతాలకూ విస్తరించాలని, ఏడాదికి 200 పని దినాలు, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని తీర్మానం, ఉచిత ఇసుక హామీని నిలబెట్టుకోవాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో నిధులను తిరిగి చెల్లించి పెండింగ్లో ఉన్న కార్మిక సంక్షేమ క్లెయిములను పరిష్కరించాలని, మహిళలపై, దళితులపై, మైనారిటీలపై దాడులను అరికట్టేందుకు చట్టం తేవాలని, పేదలకు ఇళ్ల నిర్మాణంతోపాటు టిడ్కో ఇళ్లను అర్హులకు ఇవ్వాలని, స్థానిక గుంటూరు - మాచర్ల ప్రధాన రహదారిపై సెంటర్ నుండి గజ్జల హాస్పిటల్ వరకు గాడిపడిన రోడ్డును మరమ్మతు చేయాలని, 21, 22 వార్డుల సచివాలయాన్ని ఆ వార్డుల్లోనే ఏర్పాటు చేయాలని, స్టేషన్ రోడ్‌లో నిర్మాణమైన క్రీడా ప్రాంగణాన్ని అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలను మహాసభ ఆమోదించింది.

అనంతరం 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ధరణికోట విమల మరోసారి ఎన్నికయ్యారు. సభ్యులుగా ఎం.హరిపోతురాజు, కట్ట శివదుర్గారావు, అనుముల వీరబ్రహ్మం, జడ రాజకుమార్, పంతంగి ప్రభాకర్, పి.శేషు మణికంత, కె.లోక్ నాయక్, మునగా జ్యోతి, షేక్ మస్తాన్‌వలి, పులిపాటి రామారావు, షేక్ సైదులు, మండూరి కార్తీక్ ఎన్నికయ్యారు. ట్రూ ఆఫ్ ఛార్జీలు, ఆస్తి పన్నుకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగించాలని, డిసెంబర్ 8, 9 తేదీలలో నరసరావుపేటలో జరుగుతున్న సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని డి.విమల పిలుపునిచ్చారు. మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య మాట్లాడారు. పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు, ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య, పి.సూర్యప్రకాశరావు, ఎ.ప్రసాదరావు, ఐ.లింగయ్య, పి.మహేష్ పాల్గొన్నారు.

గురజాలలో మెప్మా బజార్ ప్రారంభం

ప్రజాశక్తి - దాచేపల్లి : గురజాల పట్టణంలోని పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ బజార్‌ను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. గురజాల నగర పంచాయతీ మెప్మా మహిళా పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తు ప్రదర్శన, అమ్మకం కోసం వీటిని ఉంచారు. ఈ ఉత్పత్తులను ఎమ్మెల్యే పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గురజాల నుండి చర్లగుడిపాడు వరకు ఆర్ అండ్ బి రహదారి మరమ్మతు పనులను ప్రారంభించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'దుర్గా' విద్యార్థులు

ప్రజాశక్తి - దాచేపల్లి : రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి స్థానిక దుర్గా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి.మల్లికార్జున శాస్త్రి తెలిపారు. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం సిరిపురం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్-14 డిస్క్‌త్రోలో ప్రతిభను కనబరిచిన తమ పాఠశాల విద్యార్థులు నిరంజన్, సిరి చందన, వి.యశస్విని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు పిఇటిలు, ఉపాధ్యాయులు అభినందించారు.

వచ్చే నెల 7,8 తేదీల్లో సిపిఎం పల్నాడు జిల్లా మహాసభ

జయప్రదం కోసం సన్నాహక సమావేశం, కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై సిపిఎం నిత్యం పోరు సాగిస్తుందని, ప్రజల్లో చైతన్యం నింపుతూ ఉద్యోగుల, చిరు ఉద్యోగుల పక్షాన నిలిచి వారి గొంతుకై ప్రశ్నిస్తుందని సిపిఎం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి అన్నారు. వచ్చే నెల 7,8 తేదీల్లో జరగనున్న సిపిఎం జిల్లా మహాసభ జయప్రదం కోసం సన్నాహక సమావేశం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. శివకుమారి మాట్లాడుతూ వరుసగా 3వసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి కార్మిక, కర్షక, పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలి కార్పొరేట్ల భజన చేస్తోందని విమర్శించారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న 761 మంది రైతులను బలిగొన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పెట్టుబడిదారులకు రూ.14 లక్షల కోట్ల మాఫీ చేశాడని విమర్శించారు. కార్మికులు, కర్షకులు, విద్యార్థి, యువజన, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పాలకపక్షాలపై నికరంగ నిలబడి సిపిఎం పోరాడుతోందన్నారు. ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతున్న భారాలను ఎప్పటికప్పుడు సిపిఎం ఎండగట్టిందన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ఇసుక పాలసీకి, చెత్త పన్నుకు వ్యతిరేకంగా, సిపిఎస్ రద్దు, ఓపీఎస్ అమలు కోసం ఉద్యోగులు చేస్తున్న పోరాటాలకు వెన్నుదన్నుగా సిపిఎం నిలిచిందన్నారు. విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకిస్తూ ప్రభుత్వాలు చేస్తున్న దోపిడీని ఆపడానికి ప్రజానీకాన్ని సమీకరించి ప్రజా పోరాటాలకు అగ్రభాగాన సిపిఎం నిలిచిందన్నారు. పల్నాడు జిల్లా కేంద్రంగా నరసరావుపేట ఆవిర్భావం అనంతరం మొదటిసారి జరుగుతున్న జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు సిలార్ మసూద్, సయ్యద్ రబ్బాని, ఎవికె దుర్గారావు, షేక్ మస్తాన్‌వలి, డి.సుభాష్ చంద్రబోస్, ఎం.రాంబాబు, కె.కోటేశ్వరావు, జిలాని మాలిక్ పాల్గొన్నారు.

8-15వ తేదీల్లో ప్రచార ఆందోళనలు

జమిలి ఎన్నికల పేరుతో దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ప్రధాని నరేంద్ర మోడీ భావిస్తున్నారని, ఇందుకు సిపిఎం పూర్తి వ్యతిరేకమని శివకుమారి అన్నారు. నిత్యావసర సరుకులు కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్య మధ్యతరగతి ప్రజల జీవనం కష్టంగా మారిందని, ఉచిత ఇసుక విధానం అమలులో విధివిధానాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, ఇసుక దొరక్క భవన నిర్మాణ, అనుబంధ రంగాలు, వాటిపై ఆధారపడ్డ కార్మికులు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఎసీ, ఎస్టీ, మైనార్టీలు, వెనకబడిన వర్గాల మహిళలపై అత్యాచారాలు, హింస పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8 నుండి 15 తేదీ వరకు సిపిఎం ఆధ్వర్యంలో ప్రచారం, 15న కలెక్టరేట్ వద్ద దేశ వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు నిర్వహిస్తామన్నారు.

అంగన్వాడీ కార్యకర్త అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-గుంటూరు

తాడికొండ మండలం, లాం గ్రామానికి చెందిన అంగన్వాడీ కార్యకర్త కె.సామ్రాజ్యం అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు డి.లక్ష్మీనారాయణ, వై.నేతాజి డిమాండ్ చేశారు. ఆదివారం పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సామ్రాజ్యంకు నవంబర్ ఒకటో తేదీ సామాజిక పెన్షన్ల పంపిణీ బాధ్యతను అధికారులు అప్పగించారని, దానిలో భాగంగా ఆమె ఆరోజు 97 మందికి పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఆరోజు ఉదయం 6 గంటలకు సదరు అంగన్వాడీ కార్యకర్త సామాజిక పెన్షన్ల పంపిణీ ప్రారంభించిందని, దాదాపు సగం మందికి పెన్షన్లు పంపిణీ పూర్తి చేసిన తర్వాత ఒక వీధిలో పెన్షన్ పంపిణీ చేస్తున్న సందర్భంలో పొలం పనికి వెళ్లాల్సినవారు, అత్యవసరంగా ఇతర గ్రామాలకు ప్రయాణమై వెళ్లాల్సిన వారు అంగన్వాడీ కార్యకర్త వద్దకు వచ్చి మా పెన్షన్ ఇక్కడే ఇవ్వాలని కోరారని, వారి కోరిక మేరకు అంగన్వాడీ కార్యకర్త పెన్షన్ పంపిణీ చేస్తున్న సందర్భంగా 'ఇంటింటికీ తిరిగి పెన్షన్ ఇవ్వకుండా ఒకచోట పంపిణీ చేస్తుందని' ఎవరో ఫిర్యాదు చేశారన్న నెపంతో కనీసం ఆమె నుండి వివరణ కూడా తీసుకోకుండా అదేరోజు సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ఉత్తర్వులు ఇవ్వడం అన్యాయం అన్నారు. ఆరోజు సాయంత్రానికే అంగన్‌వాడీ కార్యకర్త 97 మందిలో గ్రామంలో అందుబాటులో లేని నలుగురు మినహా మిగతా 93 మందికి పెన్షన్ పంపిణీ పూర్తి చేసిందని, అలాంటి కార్యకర్తను సస్పెండ్ చేయడం అన్యాయం అన్నారు. కావున సామ్రాజ్యం సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని సామాజిక పెన్షన్ల పంపిణీ బాధ్యతనుండి అంగన్వాడీలను మినహాయించాలని డిమాండ్‌చేశారు. సామాజిక పించన్ల పంపిణీ ప్రధాన బాధ్యతగా ఉన్న వాలంటీర్లకు రూ.10 వేలు జీతం ఇస్తామని, వారందరినీ కొనసాగిస్తామని ఎన్నికల్లో వాగ్ధానం చేసిన కూటమి ఎన్నికలయ్యాక ఐదు నెలలుగా వారిని విధుల్లోకి తీసుకోలేదన్నారు. వారు చేయాల్సిన పనిని ఇతర శాఖల ఉద్యోగులకు బదలాయించి అదనపు పని భారం మోపడం, ఒకేరోజు పింఛన్లు పంపిణీ చేయాలని మానసిక ఒత్తిడి పెంచటం సరికాదన్నారు. ప్రభుత్వ హామీ ప్రకారం వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, రూ.10వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న వై నేతాజీ డి లక్ష్మీనారాయణ, బి లక్ష్మణ్

బూసిరెడ్డి, సాంబశివరావు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

బూసిరెడ్డి, సాంబశివరావుకు ఘన నివాళులు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి గ్రామంలో సిపిఎం, ప్రజాసంఘాల అభివృద్ధికి పాటుబడిన ఉయ్యూరు బూసిరెడ్డి, ఈమని సాంబశివరావుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం రవి కోరారు. ఇరువురి నాయకుల వర్ధంతి సభ ఆదివారం రాత్రి ఉండవల్లి సెంటర్లోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వల్లభాపురం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. రవి మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఉయ్యూరు భూసిరెడ్డి కృషి చేశారని చెప్పారు. రైతుల ధాన్యానికి గిట్టుబాటు ధర కోసం జరిగిన పోరాటంలో ఆయన కీలకపాత్ర వహించారని తెలిపారు. రైతులకు ఎరువులు, పురుగుమందులు బ్లాక్ మార్కెట్లో అమ్ముతుంటే, వాటిని కంట్రోల్ ధరలకే ఇప్పించారని, ఇందుకు తక్కెళ్లపాటి లింగారెడ్డి లాంటి సహకారం కూడా తీసుకున్నారని చెప్పారు. ఈమని సాంబశివరావు మంగళగిరి ప్రాంతంలో యువజన సంఘం కార్యకర్తగా యువతీ యువకులను సమీకరించి డివైఎఫ్ఐ బలోపేతానికి కృషి చేశారని కొనియాడారు. వారి ఆశీస్సులు ముందుకు తీసుకెళ్లడమే వారి కనిపించే నిజమైన నివాళి అని చెప్పారు. ప్రజలపై భారాలు మోపుతున్న పాలక పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు టి భక్తి రెడ్డి, ఎస్ ఇమ్మానియేల్ రాజు, కే జగదీశ్వర్ రెడ్డి, ఆర్వి రాఘవయ్య, వి పార్థసారథి, పి గాంధీ, కంచర్ల శేషయ్య పాల్గొన్నారు.

విలక్షణ రచన మేఘదూతము ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రఖ్యాత రచయిత కొమాండూరు శ్రీరామచంద్రాచార్యుల వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న రంగనాథాచార్యులు మహాకవి కాళిదాసు సంస్కృత మూలం మేఘ దూతమును ఆంధ్రానువాదంతో గ్రంథస్తంచేసి సఫలీకృతులయ్యారని డాక్టర్ కోగంటి రంగనాయకి పేర్కొన్నారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్ పద్మావతి కళ్యాణ వేదికపై ఆదివారం కొమాండూరు రామచంద్రాచార్యులు, కొమాండూరు రంగనాథాచార్యులు ఆంధ్రానువాదం చేసిన 'మేఘ దూతము' గ్రంథావిష్కరణ సభ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ అద్దంకి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆచార్య బేతవోలు రామబ్రహ్మం శిష్యుడిగా రంగనాథా చార్యులు వాస్తు, జ్యోతిష్యాలతో పాటు సాహిత్యం పరంగా కాళిదాసు విరచిత మేఘ దూతము గ్రంథాన్ని ఆంధ్రను వాదం చేసి సాహిత్యంపై తను పట్టును నిలబెట్టుకున్నారన్నారు. 1813లోనే ఆంగ్ల రచయిత హెచ్.హెచ్. విల్సన్ మేఘదూతాన్ని సంస్కృతం నుండి ఆంగ్లంలోకి అనువదించారని కొనియాడారు. అనంతరం అమరావతి పబ్లికేషన్స్ వల్లూరి శివ ప్రసాద్ గ్రంధావిష్కరణ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కోగంటి విజయబాబు, దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీ నారాయణ, డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి, కె.కృష్ణమాచార్యులు, శ్రీధరాచార్యులు పాల్గొన్నారు.

గ్రంధావిష్కరణలో పాల్గొన్న రచయితలు

గుండె జబ్బులతో అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ నూతక్కి విజయలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మధుమేహం శరీరంలోని అన్ని అవయవాల పై ప్రభావం చూపుతుందని కార్డియాలజిస్ట్ డాక్టర్ నూతక్కి విజయలక్ష్మి అన్నారు. ఆదివారం ఉదయం మధుమేహం నిరోధక మాసం సందర్భంగా స్థానిక ఎస్ హెచ్ ఓ భవనంలో హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ , మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన గుండెజబ్బుల శాస్త్రీయ అవగాహన సభలో ఆమె ప్రసంగించారు. సభకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కోశాధికారి టీవీ సాయిరాం అధ్యక్షత వహించారు. డాక్టర్ నూతక్కి విజయలక్ష్మి మాట్లాడుతూ చాలామంది గుండె పరీక్ష అనగానే ఈసీజీ చూపించుకొని గుండె అంతా బాగానే ఉందనుకుంటారని, గుండె రక్తనాళాలలో పూడికలు ఉన్న కొల్లెస్ట్రాల్ రక్తనాళాల వల్ల రెస్ట్‌లో తీసే ఈసీజీ మామూలుగానే ఉంటుందని, వ్యాయామం (ట్రెడ్మిల్)తో తీసే ఈసీజీలో తేడాలు ఉండవచ్చన్నారు. మధుమేహ బాధితులు కనీసం ఐదు సంవత్సరాలకు ఒకసారి ట్రెడ్మిల్ పరీక్ష, ఇకో పరీక్ష చేయించుకోవడం మంచిదన్నారు. ఆహారంలో వైట్ రైస్ ను బాగా తగ్గించి ఆకుకూరలు, కాయకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు ఆయాసం, గుండెనొప్పి అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. నేటి సమాజంలో ఆహారంలో వచ్చిన మార్పులు, వత్తిపరంగా వచ్చిన మార్పులు , మానసిక ఒత్తిడి, ఆందోళన పెరిగిపోతున్న ఫలితంగా మధుమేహం , గుండె జబ్బులు పెరిగిపోతున్నాయన్నారు. సభలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి సేవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏడవ రోజుకు చేరిన సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-తాడేపల్లి

తమకు రావాల్సిన నష్టపరిహారం కోసం న్యాయమైన పోరాటం చేస్తున్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళన ఆదివారం నాటికి ఏడో రోజుకు చేరుకుంది. ఇప్పటికే తాత్కాలిక గుడారాల్లాగా ఏర్పాటు చేసుకున్న కార్మికుల నివాసాలను పక్కా ఇల్లుగా నిర్మించుకోవడానికి కార్మికులు ఏర్పాటు చేసుకుంటున్నారు. కార్మికులకు రావాల్సిన బకాయిలు యాజమాన్యం వెంటనే చెల్లించాలని, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కొరపాటి స్టీవెన్, కే ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. దశల వారి పోరాటానికి సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కృష్ణ నగర్ లోని వివిధ చర్చల్లో పాస్టర్లను కలిసి తమకు అండగా నిలవాలని, ప్రార్థనతో పాటు తమ గోడు కూడా ప్రజానీకం వినే విధంగా మైక్‌లో ప్రచారం చేయాలని కోరారు. పాస్టర్ల నుండి సానుకూల సంకేతాలు వెలువడినట్లు వెల్లడించారు. డోలాష్ నగర్, నులకపేట, ప్రకాష్ నగర్ ప్రాంతాల్లో కార్మికుల న్యాయమైన పోరాటానికి సంబంధించి ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. సోమవారం నాలుగు టీంలుగా ఏర్పడి వివిధ ప్రాంతాల్లో ప్రచారం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రజా కార్మిక గర్జన పేరుతో ఈనెల 5వ తేదీ మంగళవారం తాడేపల్లి ఎమ్మార్వో కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేయాలని నిర్ణయించి నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్మికులు ఎం ఆశీర్వాదం, బి అంకయ్య, బి సూర్యప్రకాష్, పిచ్చయ్య, వై సుబ్బారావు, ఎస్కే రహీం తుల్లా, గోపి, పలువురు మహిళా కార్మికులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

సిపిఎం పెదకాకాని మండల నూతన కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రభుత్వం భూముల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్న సుందరయ్య కాలనీ స్వర్ణపురి కాలనీ ఎస్టీ కాలనీ వడ్డెర కాలనీ వివిధ కాలనీలలో నివాసం ఉంటున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని, నంబూరు ఆలీ రఫత్ నగర్‌లో ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి ఇవ్వాలని, అంగన్వాడి స్కూలు పూర్తి చేయాలని, మిగతా కాలనీలలో రోడ్లు ,డ్రైనేజీ డ్రింకింగ్ వాటర్ మౌలిక వసతులు కల్పించాలని, గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, ప్రతినెల జీతాలు ఇవ్వాలని పెదకాకాని మండల మహాసభ తీర్మానం చేశారు. ఆదివారం పెదకాకాని మండలం నంబూరులో సిపిఎం పెదకాకాని మండల మహాసభ శాఖా కార్యదర్శి ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. మహాసభ ముందుగా సిపిఎం జెండాను సిపిఎం సీనియర్‌నాయకులు తీయగూర అంజిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై నేతాజీ, ఈమని అప్పారావు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి పేదలపై భారాలు మోపడం, కార్మిక చట్టాల్లో మార్పులు చేసి ఆదాని అంబానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా, విభజన హామీలు వెనకబడిన జిల్లాలకు ప్యాకేజీ ఇవ్వకుండా పెద్ద ఎత్తున నిధులు ఇస్తున్నామని చెబుతూ ప్రజల్ని మోసం చేస్తున్నారని తెలిపారు. పోలవరానికి నిధులు, వెనుకబడిన జిల్లాల కి ప్యాకేజీ ఇవ్వాలని విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగం పెరిగిపోయిందని విద్య వైద్యం వ్యాపారం గా మార్చారని దీనివలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తన ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు. అనంతరం మహాసభ మండల కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా నన్నపనేని శివాజి, కమిటీ సభ్యులుగా ఎం శ్రీనివాసరావు, బిబాబురావు, జి రాజా రమేష్, కె ఆదంలను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జొన్నల అప్పిరెడ్డి, కె సత్యన్నారాయణ, సరిశెట్టి నాగరత్నం, అన్నపురెడ్డి వెంకటరెడ్డి, ఉల్లంగుల శివయ్య తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు తియ్యగూర అంజిరెడ్డి

మాట్లాడుతున్న ఈమని అప్పారావు, వేదికపైన వై నేతాజీ తదితరులు

ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్స్ వైద్యశిబిరం

ప్రజాశక్తి - దాచేపల్లి

గురజాలలోని శ్రీ పాత పాటేశ్వరి అమ్మవారి దేవస్థాన కళ్యాణ మండపంలో నవులూరు పరంధామయ్య - సీతమ్మ జ్ఞాపకార్థం ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత రక్తనాళాల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం స్థానిక వాగ్దేవి కాలేజీ పక్కన శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవస్థానం స్థలంలో అన్న ప్రసాద వితరణ షెడ్డును ప్రారంభించారు.

సాగర మాత ఆలయానికి సందర్శకుల తాకిడి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

స్థానిక సాగరమాత ఆలయం రెండు తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసెఫ్ బాలసాగర్ సందేశమిచ్చారు. అనంతరం ఆయన ఆధ్వర్యంలో దివ్యబలి పూజ చేశారు. ఉదయం నిర్వహించిన తేరు ప్రదక్షిణలో భక్తుల భారీగా పాల్గొన్నారు.

డీఎస్సీకి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

డిఎస్సీ పరీక్షకు హాజరవ్వాలనుకునే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 3 నెలలపాటు వసతితో కూడిన శిక్షణను ఉచితంగా ఇవ్వనున్నట్లు పల్నాడు జిల్లా ఎస్.సి వెల్ఫేర్ సాధికారిత అధికారి ఓబుల్ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.జి.టి.లకు, ఇంటర్మీడియట్‌తో పాటు డైట్ సెట్, టెట్, స్కూల్ అసిస్టెంట్స్‌కు డిగ్రీ గ్రాడ్యుయేషన్, బి.ఈ.డి, టెట్ విద్యార్హత కలిగిన అభ్యర్థులు కుటుంబ వార్షికాదాయం రూ.2.50 లక్షల లోపుంటే ఆన్లైన్/ఆఫ్-లైన్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు. పరీక్ష ఈ నెల 10న ఉంటుందని తెలిపారు.

ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

స్వామి వివేకానంద స్ఫూర్తితో మాచర్ల శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేద, నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణను ప్రారంభిస్తున్నట్లు రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి ఆదివారం తెలిపారు. మాచర్ల ప్రాంత నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీశైలం రోడ్డులోని స్వామి వివేకానంద సేవాశ్రమం నందు కంప్యూటర్ బేసిక్స్‌పై 30 రోజులు పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు క్లాస్‌లు కొనసాగుతాయని తెలిపారు. శిక్షణ తీసుకొనే వారు స్థానికులై పదో తరగతి పాస్/ఫెయిల్, 18-30 లోపు కలిగి ఉండాలన్నారు. మరింత సమాచారం కోసం 9440006813, 9346162835 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కిడ్నీ బాధితురాలికి ఆస్పత్రికెళ్లి పింఛను

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : మండలంలోని భీమవరానికి చెందిన ఎండ్లూరి జ్యోతి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. పింఛను లబ్ధిదారైన ఆమె ఇటీవల విజయవాడ ప్రభుత్వం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తాను పింఛను తీసుకునేందుకు రాలేనని, సాయం చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో ఆమెకు పింఛను అందించే ఏర్పాటు చేయాలని ఎంపిడిఒ బి.శ్రీనివాసరెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. పింఛన్లు పంపిణీ చేస్తున్న మహిళ సంరక్షణ కార్యదర్శి నాగలక్ష్మిని ఎంపిడిఒ విజయవాడ పింపించారు. ఆస్పత్రిలో ఉన్న జ్యోతికి రూ.15 వేల పింఛనును నాగలక్ష్మి ఆదివారం అందించారు.

చదువుకోవటం ఇష్టంలేకే చనిపోతున్నా

ప్రజాశక్తి- మాచర్ల

బీటెక్ విద్యార్థి భరత్ ఉరేసుకొని చనిపోయే ముందు తీసుకొన్న వీడియో తల్లిదండ్రులను తల్లడిల్లేలా చేసింది. స్థానిక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి వి.భరత్ (18) శనివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం సమీపంలోని కళ్యాణదుర్గానికి చెందిన వి.భరత్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం కాలేజీకి వెళ్లిన భరత్ మధ్యలోనే వచ్చేసి రూమ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భరత్ ఆత్మహత్య చేసుకొనే ముందు కన్నడ భాషలో తన చావును పూర్తిగా వీడియో రికార్డు చేసి, తల్లిదండ్రులకు చెప్పాల్సిన మాటలను చెప్పాడు. తనకు చదువు అంటే ఇష్టం లేదని, తల్లిదండ్రులను విడిచి ఇంత దూరం వచ్చి వుండటం కూడా ఇష్టం లేదని వీడియోలో తెలిపాడు. తాను ఏ విధంగా తల్లిదండ్రులకు సహాయ పడలేనని, చెల్లీ.. అమ్మనాన్నలను బాగా చూసుకో..బాగా చదివే చెల్లిని చదివించాలంటూ నావల్ల మీకు నష్టం తప్ప లాభం లేదంటూ నేను వెళ్ళిపోతున్నాను.. అంటూ తన ఆవేదనను వీడియో రూపంలో తల్లిదండ్రులకు తెలిపాడు. కుమారుడు మరణ వార్త తెలుసుకొని మాచర్లకు వచ్చిన తల్లిదండ్రులు ఆ వీడియో చూసి చదువంటే భయపడే భరత్ మాకు కడుపుకోత మిగిలిస్తాడని ఆనుకోలేదని బోరన విలనపించారు. ఇంటర్ పరీక్షల తరువాత భరత్ తాను ఫెయిల్ అవుతానని అనుమానంలో ఇల్లువదిలి బెంగుళూరు వెళ్లిపోయాడని, తరువాత అతడ్ని వెతికి తీసుకొచ్చినట్లు తెలిపారు. దూరం పంపిస్తే స్నేహితులతో కలసి చదువుకుంటాడని అనుకున్నామని, ఇంతలో ఇంతటి కఠిన నిర్ణయం తీసుకుంటాడని అనుకోలేదని తల్లిదండ్రులు రోధించారు. భరత్ మతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తీసుకెళ్లారు.



పల్నాడు విజ్ఞాన కేంద్రం ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టనున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నరసరావుపేట పట్టణంలోని నిమ్మతోట శ్రీసిల్మన్ మెమోరియల్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం శ్రీవేద హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారను. 100 మందికి పైగా వైద్య సేవలు పొందారని విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి తెలిపారు. శిబిరంలో శ్రీ వేద హాస్పిటల్ అధినేత డాక్టర్ నవులూరి క్రాంతి కుమార్‌రెడ్డి బిపి, షుగర్, జలుబు, దగ్గు, జ్వరం థైరాయిడ్ వంటి వ్యాధులకు పరీక్షలు చేశారు. గ్యాస్ ట్రబుల్, తలనొప్పి, గుండె సమస్యలు, రక్తహీనత వంటి దీర్ఘకాలిక వ్యాధుల భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పల్నాడు రోడ్డులోని తమ హాస్పిటల్‌లో అన్ని వర్గాల ప్రజలకు సాధారణ ధరలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తామన్నారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రతినెలా మొదటి ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్విరామంగా కొనసాగిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ తేజ, డాక్టర్ రాంప్రసాద్, విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు డి.శివకుమారి, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, కె.రామారావు, సిలార్ మసూద్, జిలానీ మాలిక్, బాషా, ఎస్.ఎం.ఎస్ బుజ్జి, రాంప్రసాద్, జవహర్ హాస్పిటల్ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ సాగర్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ క్రాంతి కుమార్‌రెడ్డి

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

మాచర్ల వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్తీకమాస అన్నదానాన్ని ఆదివారం పట్టణంలోని రామాలయంలో డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ప్రతి ఏడాది కార్తీకమాసం నెల రోజుల పాటు నిర్వహించే అన్నదానం ఎంతో మంది పేదలకు ఆకలితీరుస్తుందని డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నారు. కార్యక్రమంలో తిరుపతయ్య, కోటేశ్వరరావు, కాసులు, కోటిరెడ్డి, వెంకట నారాయణ, పులుసు చంద్రారెడ్డి, వీరారెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

అత్తులూరి సుబ్బారావుకు విశిష్ట సేవారత్న అవార్డు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గడిచిన దశాబ్ధ కాలంగా ఎంతో మంది పేదలకు, పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడంతో పాటు కరోనా సమయంలో ఎన్నో పేద కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ, 50 కుటుంబాలకు పైగా వైద్య ఖర్చులు నిమిత్తం సాయం చేసిన పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అత్తులూరి సుబ్బారావుకు అవార్డు దక్కింది. తాడేపల్లిగూడెం శ్రీపొట్టి శ్రీరాములు అభ్యుదయ వేదిక, సిరి మువ్వ సోషల్ సర్వీస్-ఆర్ట్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం తాడేపల్లిగూడెంలో సుబ్బారావుకు పొట్టి శ్రీరాములు విశిష్ట సేవారత్న అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. ఏపి ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్నిరామ సత్యనారాయణ మాట్లాడుతూ సుబ్బారావు చేస్తున్న సేవా కార్యక్రమాలను మరింత ప్రోత్సహించాలనే ఆకాంక్షతో అవార్డుకు ఎంపిక చేశామన్నారు. అత్తులూరి సుబ్బారావు మాట్లాడుతూ తనకు దక్కిన అరుదైన గౌరవం సేవా కార్యక్రమాల పట్ల తన బాధ్యత ఇంకా పెంచిందన్నారు. సుబ్బారావుకు పట్టణ ఆర్యవైశ్య పెద్దలు, ప్రముఖులు, టిడిపి నాయకులు అభినందనలు తెలిపారు.

నిత్యం ఉద్యమ రంగంలో బొల్లు శంకరరావు

బొల్లు శంకరరావు 1953 జనవరి 17న వెంకటేశ్వర్లు, నాగమ్మ దంపతులకు జన్మించారు. ధనికరైతు కుంటుంబం అందునా ఒక్క పిల్లవాడే కావడంతో అల్లారుముద్దుగా పెంచారు. విద్యార్థి దశలోనే ఉద్యమనేత చిట్టిపోతు హరిబాబుతో స్నేహం ఏర్పడింది. ఎమర్జెన్సీ కాలంలో ప్రభుత్వ నిర్బంధాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలతో ప్రభావితమై హరిబాబు ప్రోత్సాహంతో వామపక్ష భావాలను బొల్లు శంకరరావు పుణికిపుచ్చుకున్నారు. ఎమర్జెన్సీ అనంతరం భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) నిర్మాణంలో కీలకపాత్ర నిర్వహించారు. చిలకలూరిపేట డివిజన్ కార్యదర్శిగా శంకరరావు, అధ్యక్షులుగా నూతలపాటి కాళిదాసు పనిచేశారు. గ్రామ గ్రామాన యువకులను కూడగడుతూ బహుముఖ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో బోరు పంపులు పాడవగా సైకిల్‌పై చిలకలూరిపేట తెచ్చి రిపేర్లు చేయించి ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చేశారు.

అనంతరం రైతుసంఘం బాధ్యతలు నిర్వహిస్తూ 1980లో అఖిలపక్ష రైతు ఉద్యమంలో చురుగ్గా పనిచేశారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌కు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. గ్రామాల్లో తిరిగే రైతు జాతాల్లో ప్రధాన ఉపన్యాసకుడిగా ఉండి రైతు సమస్యలపై మాట్లాడేవారు. నల్లమడ రైతుసంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు, అంకమ్మచౌదరితో కలిసి నల్లమడ వాగు ముంపు ప్రాంత రైతులను ఆదుకోవడంలో, కోతలకు గురై భూమి కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కోసం, మరమ్మతుల కోసం జరిగిన

నేడు బొప్పూడిలో సంస్మరణ సభ

ఉద్యమాలన్నింటిలోనూ బొల్లు శంకరరావు కీలకంగా పని చేశారు. రైతుసంఘం చిలకలూరి పేట డివిజన్ అధ్యక్ష, కార్యదర్శు లుగా తియ్యగూర వెంకటేశ్వరరెడ్డి, బొల్లు శంకరరావు చాలాకాలం పనిచేశారు. తిమ్మాపురంలో టెక్స్ టైల్ పార్క్ పేరుతో రైతుల భూములను సేకరించడానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. బైపాస్ రోడ్డు నిర్మాణంలో రైతులకు పరిహారం కోసం పోరాడి విజయం సాధించారు.

2010లో గుంటూరులో జరిగిన అఖిలభారత కిసాన్ సభ జాతీయ మహాసభలను జయప్రదం చేయడానికి అన్ని గ్రామాలు తిరిగి రైతులను కూడగట్టారు. మహాసభల నిర్వహణకు అవసరమైన నిధులను రైతుల నుండి సమకూర్చారు. ప్రజానాట్య మండలి మహాసభలు, 2022లో జరిగిన కౌలురైతుల సంఘం రాష్ట్ర మహాసభల జయప్రదంలో ఆయన సహాయ సహకారాలున్నాయి.

ధనిక రైతు కుటుంబంలో పుట్టినా కార్మికవర్గ లక్షణాలను పుణికిపుచ్చుకున్నారు బొల్లు శంకరరావు. నిరాడంబర జీవితాన్ని గడిపేవారు. తనకున్నంతలో పార్టీ అవసరాలకు ఉపయోగపడాలని ఆలోచించేవారు. యువజన సంఘంలో తనతో పాటు పనిచేసిన కాళిదాసు పూర్తికాలం కార్యకర్తగా పని చేయడంతో ఆర్థికంగా ఇబ్బంది లేకుండా సహాయం చేయడానికి సిద్ధపడ్డారు. అయితే అది అవసరం లేదని కాళిదాసు చెప్పడంతో గుంటూరులో ఆఫీసు పైన హాలు నిర్మాణానికి రూ.5 లక్షల విరాళాన్ని అందించారు. యడ్లపాడులో పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రానికి, నరసరావుపేటలో నిర్మిస్తున్న పల్నాడు విజ్ఞాన కేంద్రానికి సహకారాన్ని అందించారు. చిలకలూరిపేట డివిజన్ కమిటిలో పోపూరి రామారావు కార్యదర్శిగా ఉన్నప్పటి నుండి తనతోపాటు సహచరులుగా ఉన్న పోపూరి సుబ్బారావు, మానుకొండ ఉపేంద్ర, తేళ్ల నారాయణ, ముద్దన వెంకటేశ్వర్లుతో కలిసి అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు.

1980లో పార్టీ సభ్యత్వం పొందిన దగ్గర నుండి చివరి వరకు మొక్కవోని దీక్షతో పనిచేశారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా సోషలిజం తప్ప మరొక ప్రత్యామ్నాయం లేదని ఘంటాపదంగా చెప్పేవారు. తన ఇద్దరు కూమార్తెలనూ అదేరీతిలో పెంచారు. ఆడంబరాలకు తావివ్వకుండా అవసరమైతే ఇతరులకు సహాయపడేలా ఉండాలని చెప్పేవారు. భార్య ఆరోగ్యం సరిగాలేదని ఆమెని కనిపెట్టుకొని ఉండాలనేవారు. చేయలేకపోతున్నాం.. అంటూనే ప్రతి పనినీ సాధ్యమైనంత వరకూ చేస్తుండేవారు. నిజాయితి నిబద్ధత, త్యాగనిరతి, సేవా దృక్పథంతో సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసిన ఆయన కృషి ఆదర్శప్రాయం. ఆయన మరణం సిపిఎంకు తీరని లోటే అయినా ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని విప్లవ జోహార్లు అర్పిస్తున్నాం. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం.

వై.రాధాకృష్ణ, సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు.

ఉత్సాహంగా రోటరీ క్రికెట్ లీగ్ మ్యాచ్

ప్రజాశక్తి -తాడేపల్లి

నిత్యం సేవ కార్యక్రమలలో ఉండే తాడేపల్లి, మంగళగిరి, గుంటూరు రోటరీ సభ్యులు ఆదివారం సాయంత్రం తాడేపల్లి బైపాస్ రోడ్డులోని అవర్ జోన్ లో గ్రౌండ్లో రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి, రోటరీ క్లబ్ అఫ్ మంగళగిరి, రోటరి క్లబ్ అఫ్ గుంటూరు సెంటినియల్, ఆధ్వర్యంలో రోటరీ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు జరిగాయి. ఈ సందర్భంగా రోటరీ ప్రతి నిధులు మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి ఉత్సాహానికి ఇలాంటి క్రీడలు రోటరీ సభ్యులకు నూతన ఉత్తేజంతో పాటు మానసిక ఉల్లాసం, కలుగుతుందని అన్నారు. సేవా కార్యక్రమాలతో పాటు ఇలాంటి క్రీడలు ఆడడంవల్ల మాన సిక ఉల్లాసము పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్ష కార్యదర్శులు రావూరి రమేష్ బాబు, సుకుమార్ రెడ్డి, రోటరీ క్లబ్ అఫ్ మంగళగిరి అధ్యక్ష కార్యదర్శులు, గాజుల శ్రీనివాస్, అందే మురళీ మోహన్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటినియల్ అధ్యక్ష కార్యదర్శులు, బాలసుబ్రమణ్యం, నవీన్, పాస్ట్ డిస్టిక్ గవర్నర్ అన్నే రత్న ప్రభాకర్, డిస్టిక్ పబ్లిక్ ఇమేజ్ చైర్మన్ అనిల్ చక్రవర్తి, క్రికెట్ మ్యాచ్ స్పాన్సర్లు ఆంధ్ర రీజియన్ స్పోర్ట్స్ చైర్మన్ మున్నంగి వివేకానంద రెడ్డి, జంగాల వెంకటేష్, పరుచూరి కిరణ్ కుమార్, చంద్ర ఓబులారెడ్డి, గోపు నాగ రాజేష్, కాట్రగడ్డ శివన్నారాయణ, శెట్టి రామకష్ణ, రోటరీ క్లబ్ అఫ్ గుంటూరు సెంటినియల్, మలినేని పెరుమాళ్ళు, అనిల్ సరి కుడి, వంశి, స్వప్న, సుష్మ, కొలికపూడి రాము, అవ్వరు ఫణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నవంబరు 2న ప్రారంభమైన ఎపి బాలబాలికల అంతర జిల్లాల అండర్- 17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం కొనసాగుతున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ ఎం రాజశేఖర్ పర్యవేక్షణలో జరుగు తున్న పోటీల్లో రాష్ట్రస్థాయి బాలబాలికలు పాల్గొన్నారు. వెయిట్ లిఫ్టింగ్ 55 కేజీల బాలుర విభాగంలో జి జయ సాయికష్ణ (గుంటూరు), స్నాచ్ నందు 60 కేజీలు, క్లీన్ అండ్ జర్క్ లో 90 కేజీలు మొత్తం 150 కేజీలలో కడప మొదటి స్థానం, విశాఖపట్నం ద్వితీయ, తతీయ స్థానాల్లో నిలిచినట్లు నిర్వాహకులు పిడి రమేష్ తెలిపారు. బాలికల 40 కేజీల విభాగంలో పశ్చిమగోదావరి, 45 కేజీల విభాగంలో తూర్పుగోదావరి వెయిట్ లిఫ్టర్లు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎస్ కోటేశ్వరరావు, సిహెచ్ గోపీనాథ్, ఎ వెంకటరామిరెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగ శిరీష పాల్గొన్నారు.

విజేతలతో కార్యక్రమ నిర్వాహకులు, న్యాయనిర్ణేతలు



ఆరోపణలు అవాస్తవం

ప్రశ్నార్థకంగా ఎపి జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ భవితవ్యం?

మీడియా సమావేశంలో సిఆర్ఒ సుజీత్

ప్రజాశక్తి - మంగళగిరి

తనపై వచ్చిన అవినీతి ఆరోపణలు అవాస్తము అని ఎపి జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సిఆర్ఒ సుజీత్ అన్నారు. మంగళగిరి ఆటోనగర్ లోని ఐహెచ్‌సి భవన్ లోని ఏపి జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మీడియాతో ఆరోపణలపై సుజీత్ మాట్లాడారు. ఇన్సూరెన్స్ క్లైయిమ్‌లు భారీగా పెండింగ్‌లో ఉన్నాయని, బోర్డు పున:నిర్మాణంకు ప్రతిపాదనలు చేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కార్పొరేషన్ పరిస్థితి మెరుగుపడుతుందని అశించామని తెలిపారు. తనపై ఉద్దేశపూర్వకంగా అవినీతి ఆరోపణలు వచ్చాయని, అంతా పారదర్శంగా జరిగిందన్నారు. ఏపి జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని, కేరళ, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రాలలో అనుసరిస్తున్న విధానంపై అధ్యయనం చేయకుండానే (ఏపీజీఐసీఎల్) ను 2020లో ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థగా కాకుండా ప్రైవేట్ సంస్థలా కొనసాగించారని, నాలుగేళ్ల నుంచి ఐఆర్డీఏ రిజిస్ట్రేషన్ అనుమతులు లభించలేదని, ఏట్టికేలకు ఐఆర్డీఏ రిజిస్ట్రేషన్ అనుమతి వచ్చే సమయంలో గందర గోళ పరిస్థితులు నెలకొన్నాయి. గత ప్రభుత్వంలో సీఎం ఒక రివ్యూ మీటింగ్ కూడా దీనిపై నిర్వహించకపోవడమే ఈ దుస్థితికి నిదర్శనంగా తెలిపారు. కూటమి ప్రభుత్వం కార్పొరేషన్ పై శీతకన్ను వేయటంతో పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, పశు, పంట, వ్యక్తిగత, సాధారణ బీమా సౌకర్యం కల్పించేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. ఎన్నికలకు ముందు పని చేసిన ఎండి, బోర్డు సభ్యులు రాజీనామాలు చేయగా, ఫైన్సాన్ జాయింట్ సెక్రటరీ అల్లాడి గౌతమ్‌ను ఇన్ చార్జ్‌గా నియమిస్తూ గత సోమవారం ఉత్తర్వూలు జారీ చేశారని, కూటమి ప్రభుత్వం ఏర్పాడిన తరువాత 4 నెలల కాలంలో కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి సారించకపోవటంతో ఉద్యోగుల భవిష్యత్ ఆందోళనగా మారిందన్నారు. తాను కార్పొరేషన్ ప్రారంభంలో కన్సల్టెంట్‌గా చేరానని, కార్పొరేషన్ ఛీఫ్ రిస్క్ ఆఫీసర్‌గా కాంట్రాక్ట్ ప్రతిపాదికన నేటి వరకు కొనసాగుతున్నానని సుజీత్ తెలిపారు. ఏపిజీఐసీఎల్ సీఈవోగా తనను ప్రతిపాదిస్తూ సెక్రటీయేట్ ప్రతిపాదనలు వెళ్లాగా, ఉన్నాతాధికారులు ఆమోదం తెలిపారని, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి ఉన్నాతాధికారులు తీసుకువెళ్లకుండా ఆర్దిక శాఖకు ప్రతిపాదన ఆమోదానికి పంపిచటంతో ప్రభుత్వం తీవ్రంగా పరిగణించిందన్నారు. సెక్షన్ ఆఫీసర్ సుబ్బారావును సస్పెన్షన్ చేసిందని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆమోదం తీసుకోవాలసిన బాధ్యత ఉన్నతాధికారులదే అన్నారు. సలహాలు ప్రతిపాదనలు వరకు నా బాధ్యత అని కీలక నిర్ణయం ఉన్నాతాధికారులదే అన్నారు. ప్రభుత్వ రంగ ఇన్సూరెన్స్ కంపెనీలు అనుసంధానం అయ్యాయని తెలిపారు. పశు భీమా సెంట్రల్ స్కీం అని, వైఎస్సార్ భీమా స్కీం కు కార్పొరేషన్ కు సంబంధం లేదని, డాక్యుమెంట్ వేరిఫికేషన్ మాత్రమే జరుగుతుందన్నారు. ఆటవీ శాఖ ఎర్రచందనం గౌడన్ల ఇన్సూరెన్స్ 2024-2025 ఏడాదికి గానూ 60, 77,116, 58 రూపాయలు, 67శాతం ప్రభుత్వానికి ఆర్ధిక భారం తగ్గించినట్లు సుజీత్ తెలిపారు.

పార్కుల అభివృద్ధి జాడే లేదు..

లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో పార్కుల అభివృద్ధి జాడే కనిపించడం లేదు. 2006 నుండి 2009 వరకు తాడేపల్లి పంచాయతీ పాలన కాంగ్రెస్ సర్పంచ్ ఆధ్వర్యంలో జరిగింది. అప్పట్లో ఉండవల్లి సెంటర్ నుండి ఒకటో వార్డు చర్చి వరకు, అంబేద్కర్ బొమ్మ నుండి రైలు బ్రిడ్జి వరకు సుమారు 150 పేదల కుటుంబాల ఇళ్లను తొలగించారు. వారి ఆక్రందనలు పాలకుల చెవికి ఎక్కలేదు. వేరే ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన మాటలు పూర్తిగా నేటికీ నెరవేరలేదు. ఆ ప్రాంతంలోనే పట్టణ ప్రజల ఆహ్లాదం పేరుతో పార్కులో ఏర్పాటు చేశారు. పార్కుల్లో ఆహ్లాదం సంగతి ఏమోగానీ అసాంఘిక శక్తులకు, మందుబాబులకు అడ్డగా మారాయి. ప్రజలు పార్కుల్లో సేదతీరియందుకు కనీసం బెంచీలు కూడా ఏర్పాటు చేయలేదు. ఆ ప్రాంతంలో మరల పేదలు ఇల్లు నిర్మించుకుంటారేమోనని ఇనపరైలింగ్ మాత్రం ఏర్పాటు చేశారు. ఇందుకోసం లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టారు. అందులో కొంత ఇనుప రైలింగ్ మెటీరియల్ను ఇటీవల దొంగలు ఎత్తుకుపోయారు. పార్కుల కోసం ఏర్పాటు చేసిన స్థలంలో పెద్ద ఎత్తున పిచ్చి చెట్లు, కంప పెరిగి అడవిని తలపిస్తు నాయి. ప్రజలకు పాలకులు ఏర్పాటు చేసిన పార్కులు ఆహ్లాదం పంచకపోగా, ఎన్నో యాళ్ల నుండి నివాసం ఉంటున్న పేదలు మాత్రం తమ ఇల్లు కోల్పోయి ఇబ్బందులు పాలయ్యారు. లక్షలాది రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం చేసి, పేదలకు కడగండ్లకు గురిచేసి చివరికి సాధించింది ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డి వేమారెడ్డి

తప్పుడు కేసులకు భయపడొద్దు : వైసిపి

ప్రజాశక్తి - మంగళగిరి

కూటమి ప్రభుత్వం పెట్టే తప్పుడు కేసులకు భయపడొద్దని, నాయకుల్ని ఇబ్బంది పెడుతుందని, కార్యకర్తలకు తాము అండగా ఉంటామని నియోజవర్గ ఇంచార్జ్ దొంతి రెడ్డి వేమారెడ్డి తెలిపారు. ఆదివారం మంగళగిరి బైపాస్ రోడ్డులోని వైసిపి మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో మంగళగిరి పట్టణ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశంలో వేమారెడ్డి మాట్లాడుతు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు ఎవరు భయపడాల్సిన అవసరం లేదని పార్టీ మీ అందరికీ అండగా ఉంటుందని అన్నారు. సమావేశంలో మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహన్ రావు, మంగళగిరి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మునగాల మల్లేశ్వరరావు, మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, మంగళగిరి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సంకె సునీత, గుంటూరు జిల్లా కార్యదర్శి మల్లవరపు సుధారాణి, మైనార్టీ జిల్లా నాయకులు షేక్ మహబూబ్, మాజీ కౌన్సిలర్ కలకోటి స్వరూప రాణి, మాజీ కౌన్సిలర్ నాలి వెంకటకృష్ణ, నాయకులు దామర్ల కుబేర స్వామి పాల్గొన్నారు.

ఒబిసి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

జనగణనతో పాటు కుల గణనా చేపట్టాలి : శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంగళగిరి

జనగణనతో పాటు కులగణన చేపట్టాలని అటల్ జననేత మైలా శ్రీనివాసరావు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం మంగళగిరి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని, 70 శాతం వరకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా చట్టసభల్లో 37 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఓబీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, ఓబీసీ బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టాలి లేదా కులగణన ప్రైవేట్ బిల్లు పార్లమెంట్లో పెట్టి ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. జాతీయ ఓబీసీ కమిషన్ జస్టిస్ రోహిణి ఆధ్వర్యంలో జాతీయ జన , కుల సర్వే చేపట్టి రాజ్యాంగ చట్టబద్ధంగా అమలు చేసి 140 కోట్ల జనాభా ప్రాతిపదికను గుర్తించి 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేయాలని మైలా శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పట్టణ గౌడ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి పట్టణ గౌడ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పాటు అయింది. ఆదివారం మంగళగిరి పట్టణ గౌడ సంక్షేమ సంఘం స్థలంలో నూతన సభ్యులను ఎన్ను కొవడం జరిగిందని నాయకులు తెలిపారు. సంఘం అధ్యక్ష,కార్యదర్శులుగా కోసూరి చంద్రశేఖర్, రేఖా రామారావు, వైస్ ప్రెసిడెంట్ గా పాగోలు శ్రీనివాస రావు, జాయింట్ సెక్రటరీగా రేఖా వీర రాఘవులు, ట్రెజరర్ గా వాకా కృష్ణ మోహన్ కార్యవర్గ సభ్యులుగా ఎనుమల మాధవరావు, కోసూరి రవికుమార్, ఉసిరికాయల ఆదిలక్ష్మీ, పి రామకృష్ణ,లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు రేఖా సుధాకర్ గౌడ్, పాగోలు శ్యామ్ ప్రసాద్, వాకా మంగారావు ,వాకా మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి పట్టణంలోని మెయిన్ రోడ్ మున్సిపలజోనల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంటిఎం సి కమిషనర్ ఆలిం భాష తెలిపారు. ప్రజలు తమ ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వివిధ డిపార్ట్మెంట్ల అధికారులు ఈ కార్యక్రమంలో అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రజలు అర్జీలు రూపంలో తమ సమస్యలు వ్రాతపూర్వకంగా ఇవ్వాలని కోరారు. వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తామని కమిషనర్ అలిం భాష హామీ ఇచ్చారు.

తాడేపల్లి సర్వీసు రోడ్డులో ఆస్టర్ రమేష్ వైద్య విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎండి డాక్టర్ పోతినేని తదితరులు

రాజధానిలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వైద్య విభాగం ప్రారంభం

ప్రజాశక్తి -గుంటూరు

రాజధాని అమరావతి ప్రాంత ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు తాడేపల్లి సర్వీసు రోడ్డు వద్ద అవుట్ పేషెంట్ వైద్య విభాగాన్ని ప్రారంభించామని ఆదివారం ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈ సెంటర్‌లో ఫార్మసీ, లేబొరేటరీ, ఎక్స్ రే, ఈసీజీ, ఎకో కార్డియోగ్రామ్, ట్రెడ్ మిల్ టెస్ట్, అల్ట్రాసౌండ్ స్కానింగ్, టెలి మెడిసిన్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉంటాయన్నారు. అంతేకాకుండా, 5జీ టెక్నాలజీతో కూడిన ఐసీయూ ఆన్ వీల్స్ అంబులెన్స్ ద్వారా అత్యవసర వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కేంద్రంలో అన్ని రకాల మాస్టర్ హెల్త్ చెకప్‌లు, స్పెషలిస్ట్ కన్సల్టేషన్‌లు, ఇంటి వద్ద నుండే ల్యాబ్ శాంపిల్ సేకరణ, ఇంటివద్దకే మందులు అందించే సదుపాయాలు కలవు. ప్రతి మంగళవారం ఉచితంగా వైద్య నిపుణుల కన్సల్టేషన్ కూడా అందుబాటులో ఉంటుందని డాక్టర్. రమేష్ బాబు తెలియజేశారు. వైద్య రంగంలో 36 సంవత్సరాల అనుభవం కలిగిన ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, విజయవాడలో మూడు శాఖలు, గుంటూరు, ఒంగోలులో రెండు శాఖలు మరియు ఏలూరు బ్రాంచ్‌తో కలిపి 925 పడకల సామర్థ్యం, 2800 మంది సిబ్బంది, 200 మంది నిష్ణాతులైన స్పెషాలిటీ మరియు సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులతో సేవలు అందిస్తోందని, అంతేకాకుండా, 26 అవుట్ రీచ్ సెంటర్లను నిర్వహిస్తూ, అత్యున్నత నాణ్యతా ప్రమాణాల సంస్థ ఎన్.ఎ.బి.హెచ్. నిర్దేశించిన వైద్య ప్రమాణాలను పాటించి, కోస్టల్ కారిడార్ వైద్య పటంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చైర్మన్ మద్దిపాటి సీతా రామమోహనరావు, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, గ్రూప్ బిజినెస్ హెడ్ డాక్టర్ వై. కార్తీక్ చౌదరి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ నాదెళ్ల గిరిబాబు, యూనిట్ హెడ్స్ డాక్టర్ కారుపాటి సుదర్శన్, డాక్టర్ సుమ, డాక్టర్ నితిన్, ఇతర వైద్యులు మరియు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కార్యవర్గం

పాఠశాల విద్య సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు : ఎపి స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం పాఠశాల విద్య ఆర్‌జెడి కార్యాలయంలో జరిగిన ఎన్నికల కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి.పద్మకుమారి, సెక్రెటరీ జనరల్ శ్రీనివాస్, ఎలక్షన్ ఆఫీసర్ ఎండి.హిదయతుల్లా, సోములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షులుగా వి.వజ్రబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సిహెచ్.భాను, ఉపాధ్యక్షులుగా డి.రాంబాబు, యం.రవింద్రబాబు, కె.ప్రసాద్‌బాబు, పి.వి.కృష్ణ, పి.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా టి.వి.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా యం.అనిల్, సెక్రెటరీలుగా కె.మనోహర్, పి.దుర్గాప్రసాద్ నాయక్, ఎ.హరిసాయిరాం, పి.పవన్‌కుమార్, డి.జార్జ్ విలియమ్స్, మహిళా కార్యదర్శి జి.విజయలక్ష్మి, ట్రెజరర్‌గా సిహెచ్.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని శాలువాలు, బొకేలతో అభినందించారు.

ధన్యజీవి సర్రాజు వేణుగోపాలరావు

ప్రజాశక్తి-గుంటూరు : ఉపాధ్యాయుడిగా ఐదు దశాబ్దాల క్రితం తనతోపాటు వేలాదిమంది జీవితాలలో వెలుగులు నింపిన 'యశస్వి' సర్రాజు వేణుగోపాలరావు మాస్టారి జీవితం ధన్యమని ఎన్నారై, హృద్రోగ నిపుణులు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. 'యశస్వి' సర్రాజు వేణుగోపాలరావు స్మారక ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రధాన సభ స్థానిక లక్ష్మీపురం త్యాగరాజ సాంస్కృతిక సంఘం సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. తమను తీర్చిదిద్దిన గురువుల గురించి 'గురుస్మరణ' పుస్తకాన్ని ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రీనివాసరెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించారు. 'సంస్కృతి' బాలచందర్ స్వాగతం పలుకగా, సాహితీవేత్త మోదుగుల రవికష్ణ సభకు అధ్యక్షత వహించారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కా రాలను పున్నం జ్యోతివాసు, మేడగాని శేషగిరి అందుకున్నారు. ప్రజా గాయకుడు పివి రమణ, లెనీనా పాటలు ఆలపించారు. కార్యక్రమంలో కవి, విద్యావేత్త ముప్వా శ్రీనివాసరావు, పలువురు విద్యావేత్తలు, సాహితి వేత్తలు, సర్రాజు వేణు గోపాలరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న డాక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు

సహకార సంఘాల్లో కంప్యూటర్ సేవలు

- రికార్డులన్నీ కంప్యూటరీకరణ
- రైతుసేవా కేంద్రాలతో అనుసంధానం
- కొత్త సభ్యుల చేరికపై మార్గదర్శకాలు రాలేదు
- ప్రజాశక్తితో జిల్లా సహకార శాఖ అధికారి కె.వీరాచారి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో (పిఎసిఎస్) రికార్డులు, లావాదేవీలన్ని కంప్యూట రీకరణ చేస్తున్నట్టు జిల్లా సహకార శాఖ అధికారి ఎం.వీరాచారి తెలిపారు. ఈ ప్రక్రియ ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని 167 సహకార సంఘాల్లో జరుగుతుందన్నారు. గుంటూరు జిల్లాలోని 64 సంఘాల్లో ఈనెలాఖరుకు ఈ ప్రక్రియ పూర్తవుతుం దన్నారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

పిఎసిఎస్‌లలో ప్రస్తుతం అందుతున్న సేవలు?

సహకార సంఘాల్లో ఉన్న సభ్యులు, వారి వివరాలు, సంఘం పరిధిలోని రైతులు, వారికి అందిస్తున్న సేవా కార్యక్రమాలకు సంబంధి ంచిన రికార్డులన్నింటిని కంప్యూటరీకరణ చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటి వరకు మాన్యువల్‌గా జరుగుతున్న సేవలను ఇక మీదట కంప్యూటరీకరణ ద్వారా నిర్వహిస్తారు. ఈమేరకు ప్రత్యేక సాఫ్టువేర్‌ను రూపొందించారు. ఈ ప్రక్రియ దాదాపుగా మరో నెల రోజుల్లో పూర్తి చేయాలని తలపెట్టాం. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, పరుగు మందులు, విత్తనాలు అందించే ప్రక్రియ కొనసాగుతోంది. వ్యవసాయ, ఉద్యాన శాఖల సహకారంతో ఈ సేవలు కొనసాగిస్తున్నాం. ప్రతి సహకార సంఘంలో కామన్ సర్వీసు సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆధార్ అప్ డేషన్, ఈకేవైసి, వివిధ రకాల ప్రభుత్వ ధృవపత్రాల జారీ, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి నిర్వహిస్తున్న సేవలన్నీ కామన్ సర్వీసు సెంటర్ల ద్వారా అందిస్తారు.

రుణాల మంజూరులో అక్రమాల నిరోధానికి తీసుకుంటున్న చర్యలు?

సంఘం పరిధిలో రుణ పొందే రైతులకు సంబంధించి ముందుగానే ఈకేవైసి చేయాల్సి ఉంటుంది. ఈక్రాప్, ఈకేవైసి, ఆధార్ సీడింగ్, పట్టాదారు పాసు పుస్తకాలు, ఇతర అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే రుణాలు పొందేలా పగడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం.

సహకార సంఘాల్లో పాలక కమిటీలు వేసే అవకాశం ఉందా?

ప్రస్తుతం అధికారులను పర్సన్ ఇన్‌ఛార్జిలుగా నియమించారు. జిల్లా జాయింట్ కలెక్టరు డిసిసిబి, డిసిఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. అలాగే సహకార సంఘా ల స్థాయిలో ప్రత్యేక అధికారులు పర్సన్ ఇన్ ఛార్జిలను ఏర్పాటు చేశారు. నామినేటెడ్ పద్ధ తిలో కమిటీల ఎంపిక ప్రక్రియ గత ప్రభు త్వంలో జరిగింది. ప్రస్తుతం ఇందుకు సంబ ంధించి ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు.

సహకార సంఘాల్లో సభ్యులుగా చేరాలంటే?

సహకార సంఘాల్లో స్థానిక రైతులంతా సభ్యులుగా ఉండవచ్చు. గతంలో రూ.300 షేర్ ధనంతో సభ్యులుగా చేరు వారు. 2018 నుంచి ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల కొత్త సభ్యుల చేరికపై ఇప్పటి వరకు ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. షేర్ ధనం పెంచుతారా? ఇదే స్థాయిలో కొనసాగిస్తారా అనే విషయంలో కూడా ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు వస్తాయి.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

డిసెంబర్ 13,14 తేదీల్లో పల్నాడు బాలోత్సవం

బ్రోచర్లను ఆవిష్కరించిన ఎంపీ, ఎమ్మెల్యే, డిఇఒ - 65 అంశాల్లో పోటీలు

10 వేల మందికి పైగా విద్యార్థులను భాగస్వామ్యం చేసేందుకు కమిటీ కృషి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు బాలోత్సవం-2024 పిల్లల పండుగ జిల్లా స్థాయి అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు డిసెంబర్ 13, 14 తేదీల్లో నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని పాలడుగు నాగయ్య చౌదరి - కొత్త రఘురామయ్య కళాశాలలో నిర్వహిస్తామని పల్నాడు బాలోత్సవం కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్. రాజగోపాల్‌రెడ్డి (ఆక్స్‌ఫర్డ్ రాజారెడ్డి), కట్టా కోటేశ్వరరావు ఆదివారం ప్రకటించారు. పల్నాడు బాలోత్సవం బ్రోచర్‌ను నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణ దేవ రాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ వేర్వేరుగా ఆవిష్కరించారు. మొత్తం 65 విభాగాల్లో పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పిల్లల పండుగలో పాల్గొనేలా మార్గదర్శకాలు రూపొందించామని నిర్వాహకులు చెప్పారు. శాస్త్రీయ నృత్యాలు, లఘు నాటికలు, కోలాటం, బుర్రకథలు, మట్టి బొమ్మల తయారీ ఇలా 65 అంశాల్లో 3వ తరగతి నుండి 10 తరగతి విద్యార్థులు 10 వేల మందికి పైగా పాల్గొన నున్నట్లు తెలిపారు. విద్యార్థులు కంప్యూటర్, టివి, సెల్‌ఫోన్‌లకు అంకితమై తమలోని సృజనత్మకతను కోల్పోతున్నారని, వారిలోని శక్తి సామర్థ్యాలు మరుగున పడుతున్నాయని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ నాయకుల త్యాగాలు, వారి జీవిత చరిత్ర పిల్లలకు తెలియడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. స్మార్ట్ ఫోన్‌ల నుండి పిల్లలు క్రైమ్‌కు అలవాటు పడు తున్నారని అన్నారు. పిల్లల్లోని మేధస్సుకు పదును పెట్టాలంటే బాలోత్సవాలు వంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. గతే డాది నిర్వహించిన బాలోత్సవాల్లో జిల్లా వ్యాప్తంగా 175 పాఠశాలల నుండి 8 వేల మంది విద్యార్థులు హాజరయ్యారని పల్నాడు బాలోత్సవం కమిటీ గౌరవాధ్యక్షులు ఎం.ఎస్. ఆర్.కె ప్రసాద్ తెలిపారు.

బ్రోచర్ ఆవిష్కరించిన ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు తదితరులు

పరిశీలన,పరిసరాల పట్ల అవగాహనకు దోహదం : ఎంపి

బాలోత్సవం ద్వారా విద్యార్థులలో స్వయం పరిశీలన శక్తి, పరిసరాల పట్ల అవగాహన పెంచేందుకు అవకాశం ఉంటుందని ఎంపీ అన్నారు. ఇరుకైన తరగతి గదులు, ర్యాంకుల వెంట పరుగులతో పిల్లల్లో సృజనాత్మకత మరుగున పడుతోందని ప్రతిఒక్కరికీ ఒక్కో దానిపై ఆసక్తి ఉంటుందని, కాని నేటి విద్యావిధానం వల్ల తమ ఆసక్తిని వెల్లడంచే అవకాశం లేక వత్తిడికి గురి కావడం బాధాకరమని ఆవేదన వెలిబుచ్చారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెరగడం లాంటి సానుకూల అంశాలకు బాలోత్సవాలు దోహదపడతాయన్నారు.

ప్రతిభను వెలికితీస్తున్న బాలోత్సవాలు : ఎమ్మెల్యే

దేశ భవిష్యత్ పిల్లల చేతిలో ఉంటుందని, అలాంటి పిల్లలను ఒత్తిడి నుంచి బయటకు తెచ్చి వారిలో నిద్రాణమైన ప్రతిభను వెలికి తెస్తున్న బాలోత్సవాలకు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే సూచిం చారు. సృజనాత్మకత పెరగడానికి, వినూ త్న ఆలోచనలకు బాలో త్సవాలు దోహదం చేస్తా యన్నారు. పిల్లల పండుగ జయ ప్రదా నికి తానూ సహక రిస్తానన్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు